“ మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక

“ మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 15-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 197 Issue: 197

15 జనవరి 2026 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - హేమంత ఋతువు పుష్య మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:53 సూర్యాస్తమయం - సా. 5:57 తిథి ద్వాదశి రా. 8:14 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం జ్యేష్ఠ తె. 5:40o వరకు తరువాత మూల యోగం వృద్ధి రా. 8:32 వరకు కరణం కౌలవ ఉ. 7:06 వరకు తైతుల రా. 8:14 వరకు వర్జ్యం ఉ. 9:17 నుండి ఉ. 11:04 వరకు దుర్ముహూర్తం ఉ. 10:34 నుండి ఉ. 11:19 వరకు మ. 3:00 నుండి మ. 3:44 వరకు రాహుకాలం మ. 1:48 నుండి మ. 3:11 వరకు యమగండం ఉ. 6:53 నుండి ఉ. 8:16 వరకు గుళికాకాలం ఉ. 9:39 నుండి ఉ. 11:02 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:17 నుండి ఉ. 6:05 వరకు అమృత ఘడియలు రా. 7:58 నుండి రా. 9:45 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:03 నుండి మ. 12:47 వరకు గమనిక: “o” అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com



‘ఈవార్తలు’ దినపత్రిక పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులు, తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు.

–శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నేడు (గురువారం) మా పత్రిక కార్యాలయానికి సెలవు. కాబట్టి శుక్రవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం (జనవరి 17న). ధన్యవాదాలు.

– శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,400 |
| వెండి (గ్రాము): | రూ.307 |
| ప్లాటినం (గ్రాము): | రూ.7,014 |

## విశ్వవాణి




తూర్పు చైనాకు చెందిన ఓ తల్లి.. చదువు లేకపోతే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో తన 17 ఏళ్ల కొడుక్కి తెలియజేయాలని ఓ స్నాక్స్ స్టాల్ వద్ద పనికి ఉంచింది. అయితే, అతడు ఫ్రైడ్ చికెన్ అమ్మి కేవలం 10 రోజుల్లోనే 10,000 యువాన్లు (రూ.1,26,000) సంపాదించాడు. దీంతో తన తల్లి షాకైంది. అంతేకాదు.. ఆ అబ్బాయి తన చదువుకు ఫుల్ స్టాప్ పెట్టి, ఫుల్ టైం బిజినెస్‌లోకి ఎంటరయ్యాడు. దీనికి సంబంధించిన కథనం సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్‌లో ప్రచురితమైంది.

## • సంక్రాంతి సంబురాల్లో ప్రధాని మోదీ



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పొంగల్ వంటకం తయారు చేశారు. ఢిల్లీలోని కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో జరిగిన పొంగల్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ తొలుత పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పొంగల్ వండి, గోవులకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## • శబరిమలలో మకర జ్యోతి దర్శనం



కేరళలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం శబరిమలలో మకరజ్యోతి దర్శనం అశేష భక్తజన సందోహం మధ్య కనులపండువగా జరిగింది. మకర సంక్రాంతి పుణ్యదినమైన బుధవారం సాయంత్రం 6:30 గంటల తర్వాత పొన్నాంబలమేడు కొండపై మకరజ్యోతి మూడుసార్లు భక్తులకు దర్శనమిచ్చింది. ఈ అపురూప దృశ్యాన్ని తిలకించిన లక్షలాది మంది భక్తులు స్వామియే శరణం అయ్యప్ప అంటూ చేసిన శరణుఘోషతో శబరిగిరులు మార్మోగిపోయాయి.

# కుక్కలు.. కోతులు

### బెంబేలెత్తుతున్న ప్రజానీకం.. పట్టించుకోని ప్రభుత్వం

### పల్లెల్లో గుంపులుగా వానర సైన్యం.. పట్టణాల్లో శునకాల వీరంగం



ఇంటి నుంచి బయటకు రావాలంటే భయం.. పొలానికి వెళ్లాలంటే ఆందోళన.. చివరకు నడిరోడ్డుపై ప్రాణాలతో ఇంటికి చేరుతామన్న నమ్మకం లేని దుస్థితి. గ్రామాలను కోతులు పట్టి పీడిస్తుంటే, పట్టణాలను వీధికుక్కలు చెరబట్టాయి. ఇది ప్రకృతి వైపరీత్యం కాదు.. పాలకుల అసమర్థతకు పరాకాష్ఠ. ఒకప్పుడు అడవికే పరిమితమైన కోతులు, నేడు పల్లెలను తమ అడ్డాగా మార్చుకున్నాయి. అడవుల్లో ఆహారం లేక, ఆవాసాలు కోల్పోయి అవి గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. కానీ, ఈ మార్పు వెనుక ప్రభుత్వాల దూరదృష్టి లోపం స్పష్టంగా కనిపిస్తోంది. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కోతులు కళ్లముందే నాశనం చేస్తున్నాయి.

(ఈవార్తలు ప్రత్యేకం)

వేరుశనగ, మొక్కజొన్న, కూరగాయలు.. ఇలా ఏ పంట వేసినా కోతుల గుంపులు దాడి చేస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వేల ఎకరాల్లో కోతుల భయంతో రైతులు సాగునే వదిలేశారు. ఇది కేవలం రైతు సమస్య కాదు, రాష్ట్ర ఆహార భద్రతకు ముప్పు. కిటికీలు తెరిస్తే చాలు కోతులు లోపలికి వచ్చి ఆహార పదార్థాలను -2 వ పేజీలో...



# తక్షణమే ఇరాన్‌ను వీడండి

### భారతీయులకు ఎంబసీ పిలుపు

### పరిస్థితి దిగజారిందని వెల్లడి

టెహ్రాన్: ఇరాన్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. గత కొన్ని రోజులుగా కొనసాగుతోన్న ఆందోళనల కారణంగా అక్కడ మారణహోమం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. వేలాది మంది మృతి చెందగా, అందులో ఆందోళనకారులు 1,850 మంది, భద్రతా దళాల సిబ్బంది 135 మంది ఉన్నారు. ఆందోళనలతో సంబంధం లేని వారు కూడా పదుల సంఖ్యలో మరణించారు. ఆ దేశంలో ఎస్ఎంఎస్‌లు, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ఇరాన్‌లో ఆందోళనలు తీవ్ర హింసాత్మకంగా మారుతున్న తరువాయి 2 వ పేజీలో...

# అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్టు

### నోటీసులు ఇవ్వకుండా ఇళ్లలోకి వెళ్లి నిర్బంధం.. తీవ్రంగా ఖండించిన నేతలు, జర్నలిస్టు సంఘాలు



హైదరాబాద్, జనవరి 14 (ఈవార్తలు): వివాదాస్పద వార్త ప్రసారం చేసిన కేసులో సిట్ అధికారులు.. జర్నలిస్టులను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడం రాష్ట్రంలో తీవ్ర చర్చకు దారి తీసింది. సంక్రాంతి పండుగ వేళ జర్నలిస్టుల ఇళ్లకు వెళ్లి.. ఎలాంటి ప్రొసీజర్ పాటించకుండా, నోటీసులు ఇవ్వకుండానే పోలీసులు అరెస్టులు చేయడాన్ని జర్నలిస్టు సంఘాలు, పౌర సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ ఘటనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలన చేతకాని ప్రభుత్వం పండుగ పూట జర్నలిస్టులపై కక్ష్య సాధింపు చర్యలకు దిగడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులైన జర్నలిస్టులను రాజకీయ వికృత క్రీడల్లో బలిచేయడం దుర్మార్గమని అన్నారు. అర్ధరాత్రి వేళ ఇళ్లలోకి చొరబడి తరువాయి 2 వ పేజీలో...

# మున్సిపల్ రిజర్వేషన్లు ఖరారు

### రేపు నోటిఫికేషన్ వచ్చే చాన్స్!

హైదరాబాద్, జనవరి 14 (ఈవార్తలు): రాష్ట్రంలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం నుంచి కీలక సమాచారం అందింది. మున్సిపల్ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసింది. రాష్ట్రంలోని 121 మున్సిపాలిటీల్లో జనరల్ కేటగిరిలో 30, జనరల్ మహిళలకు 31, బీసీ జనరల్ 19, -2 వ పేజీలో...

# కెనడా ఉగ్రవాదుల అడ్డా

### 40 ఏళ్లుగా మొత్తుకుంటున్నాం

### అయినా పట్టించుకోలేదు

### కెనడాపై భారత రాయబారి నిప్పులు



# భారత విద్యార్థులపై నిఘా

### ఆస్ట్రేలియా వీసా నిబంధనలు కఠినతరం

### కేరళ 10 లక్షల ఫేక్ సర్టిఫికెట్ల ఎఫెక్ట్



# ఎరగా భార్య!

### భార్యాభర్తల వలపు వల

### నగ్న వీడియోలతో బ్లాక్‌మెయిల్

### బెదిరింపులతో రూ.లక్షలు వసూలు

### 100 మంది వరకు బాధితులు

# తీన్మార్ మల్లన్నకు ‘కత్తెర’

### టీఆర్పీకి గుర్తు కేటాయింపు



హైదరాబాద్, జనవరి 14 (ఈవార్తలు): తీన్మార్ మల్లన్న పార్టీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ)కి ఎన్నికల సంఘం కత్తెర గుర్తును కేటాయించింది. ఈ మేరకు తీన్మార్ మల్లన్న మీడియాతో వెల్లడించారు. ‘78 ఏళ్ల బానిస సంకెళ్లను కత్తిరించేందుకు టీఆర్పీకి కత్తెరనే ఆయుధం. మార్పు మన చేతుల్లో.. అభివృద్ధి మన తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

15.1.2026

మేషం: సేవా కార్యక్రమాలు నిర్వహించి మీ విలువ మరింత పెంచుకుంటారు. ఉద్యోగస్తులకు పదోన్నతుల పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుని లాభాలు అందుకుంటారు. భూ క్రయ విక్రయాలలో నూతన లాభాలు అందుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు అవరోధాలు తొలగుతాయి.

వృషభం: దూర ప్రయాణం సూచనలు ఉన్నవి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. దీర్ఘకాలిక వివాదాలు నుండి కొంతవరకు బయటపడ గలుగుతారు. ఉద్యోగాలలో అధికారుల నుండి విమర్శలు ఎదుర్కొంటారు. కుటుంబ సభ్యుల ప్రవర్తన మానసికంగా బాధిస్తుంది. ఆర్థిక ఇబ్బందులు ఉంటాయి.

మిధునం: ఋణ దాతల ఒత్తిడి వలన మానసిక సమస్యలు కలుగుతాయి. చేపట్టిన పనులు కొంత చాలాకష్టం మీద పూర్తి అవుతాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. కీలక వ్యవహారాలలో ఆలోచనలలో స్థిరత్వం లోపిస్తుంది. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి.

కర్కాటకం: విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. సంతాన విద్యా విషయాలు సంతృప్తి కలిగిస్తాయి. వృత్తి సమాజంలో ప్రముఖుల ఆదరణ పెరుగుతుంది. వ్యాపారాలలో ఆశించిన పురోగతిలో సాధిస్తారు. ఉద్యోగమున సహెూద్యోగులతో సఖ్యతగా వ్యవహరిస్తారు.

సింహం: నిరుద్యోగ ప్రయత్నాలు కలసివస్తాయి. చేపట్టిన వ్యవహారములు అనుకున్న విధంగా పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలలో యత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగులకు హెూదాలు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రులతో దూర ప్రయాణాలు చేస్తారు. నూతన వ్యక్తుల పరిచయాలు లాభసాటిగా సాగుతాయి.

కన్య: వృత్తి, వ్యాపారాలు సాధారణంగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులతో స్వల్ప విభేదాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. చేపట్టిన వ్యవహారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. గృహ నిర్మాణ ప్రయత్నాలు మందగిస్తాయి.

తుల: మిత్రులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఇంటా బయట కొందరి ప్రవర్తన వలన మానసిక ప్రశాంతత లోపిస్తుంది. ఉద్యోగ వాతావరణం నిరుత్సాహ పరుస్తుంది. దూర ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది.

వృశ్చికం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. దీర్ఘకాలిక వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. నిరుద్యోగులకు అందిన సమాచారం ఉత్సాహాన్నిస్తుంది. ఉద్యోగమున అదనపు బాధ్యతల నుండి ఉపశమనం పొందుతారు. సోదరుల నుండి శుభవార్తలు అందుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. సన్నిహితులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.

ధనస్సు: నేత్ర సంభందిత ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ వాతావరణం కొంత గందరగోళంగా ఉంటుంది. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు కలిసిరావు. ఉద్యోగమున అదనపు బాధ్యతలు చికాకు పరుస్తాయి. ఆధ్యాత్మిక విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో ప్రతిబంధకాలు ఉంటాయి.

మకరం: సన్నిహితులతో గృహమున ఉత్సాహంగా గడుపుతారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో నూతన ఆలోచనలు ఆచరణలో పెట్టి లాభాలు అందుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో ఆశించిన అవకాశములు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో ఆకస్మిక విజయం సాధిస్తారు.

కుంభం: వృత్తి వ్యాపారాలలో ఊహించని మార్పులు తప్పవు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. ఉద్యోగమున ప్రతికూల వాతావరణం ఉంటుంది. వృధా ఖర్చులు చేదాటుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. జీవిత భాగస్వామితో అకారణ వివాదాలు కలుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మీనం: నిరుద్యోగులకు అనుకూల వాతావరణం ఉంటుంది. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. వృత్తి, వ్యాపారాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. ఉద్యోగస్తులకు అధికారుల అనుగ్రహం పొందుతారు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగవుతుంది. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

# కుక్కలు.. కోతులు

**మొదటి పేజీ తరువాయి**

ఎత్తుకెళ్తున్నాయి. అడ్డువచ్చిన మహిళలు, పిల్లలపై దాడులు చేస్తున్నాయి. కోతుల భయంతో ఇళ్లకు గ్రిల్స్ కొట్టించుకుని 'జైలు' లాంటి జీవితం గడుపుతున్నారు గ్రామస్తులు.

## పట్టణాల్లో భయం భయం

నగరాల్లో పరిస్థితి మరీ దారుణం. గల్లీకో గుంపు.. మలుపుకో మంద. వీధి కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోతున్న చిన్నారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కుక్కల దాడుల్లో మరణిస్తున్న వారిలో 90% మంది పేద పిల్లలే. వారు ఆడుకునే వీధుల్లో రక్షణ లేకుండా పోయింది. ఇటీవలే హైదరాబాదులోనూ, ఇతర నగరాల్లోనూ చిన్నపిల్లలను కుక్కలు పీక్కుతిన్న ఘటనలు చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. రాత్రి వేళల్లో బైకులపై వెళ్లే వారిని కుక్కలు వెంబడించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలామంది భయం వల్ల కిందపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. మున్సిపల్ అధికారులు కేవలం 'కుక్కలను పట్టుకెళ్లి స్టెరిలైజేషన్ (కుటుంబ నియంత్రణ) చేసి వదిలేస్తున్నాం' అని చేతులు దులుపుకుంటున్నారు. కానీ, వాటి దూకుడు ఏమాత్రం తగ్గడం లేదు.

## పాలకుల అసమర్థతఖీ

కుక్కలు, కోతుల సమస్యలపై ప్రభుత్వాల వైఖరి దారుణంగా ఉంది. సమస్య తీవ్రతను గుర్తించడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారు. కోతుల కోసం ప్రత్యేక పార్కులు ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చారు కానీ, అవి కార్యరూపం దాల్చలేదు. నిధులు లేవనే సాకుతో ప్రాజెక్టులను అటకెక్కించారు. కుక్కల దాడులు జరిగినప్పుడు మాత్రమే అధికారులు స్పందిస్తారు. ఒక వారం పాటు హడావుడి చేసి, ఆ తర్వాత మళ్ళీ యథవిధిగా వదిలేస్తారు. జంతు హింస నిరోధక చట్టాల సాకుతో అధికారుల చేతులు కట్టేస్తున్నారు. జంతువుల హక్కుల కంటే మనుషుల ప్రాణాలు విలువైనవన్న ప్రాథమిక సూత్రాన్ని పాలకులు మర్చిపోయారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలి. ప్రతి జిల్లాలో కోతుల కోసం ప్రత్యేక రక్షణ కేంద్రాలు, అడవుల్లో పండ్ల మొక్కల పెంపకం చేపట్టాలి. వీధి కుక్కలకు కేవలం నామమాత్రపు ఆపరేషన్లు కాకుండా, వాటి సంఖ్యను శాశ్వతంగా తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. వీధి కుక్కలను జనావాసాల నుంచి దూరంగా ప్రత్యేక షెల్టర్లలో ఉంచేలా బడ్జెట్ కేటాయించాలి. కోతుల వల్ల పంట నష్టపోయిన రైతులకు, కుక్కల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు భారీ నష్టపరిహారం చెల్లించాలి. అభివృద్ధి అంటే కేవలం ఫ్లైఓవర్లు, హైవేలు నిర్మించడం కాదు.. ప్రజలకు కనీస భద్రత కల్పించడం. ఒక చిన్నారి వీధిలో ఆడుకోవాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉందంటే, అది ప్రభుత్వ పాలనకే సిగ్గుచేటు. ఓట్ల కోసం వేల కోట్లు ఖర్చు చేసే రాజకీయ పార్టీలు, ఈ మూగ జీవుల సమస్యను పరిష్కరించి మనుషుల ప్రాణాలు కాపాడలేవా? ప్రజల సహనం నశించక ముందే పాలకులు మేల్కోవాలి.

# అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్టు

**మొదటి పేజీ తరువాయి**

అరెస్టులు చేయడానికి జర్నలిస్టులు ఏమైనా తీవ్రవాదులా..? అని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యంపై ప్రభుత్వం చేస్తున్న దాడి, తెలంగాణ జర్నలిస్టుల ఆత్మగౌరవంపై ప్రత్యక్ష దాడి జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణం విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

## చట్టం తన పని తాను చేసుకుపోతుంది: సజ్జనార్

మహిళా ఐఏఎస్‌పై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ మీడియాకు వెల్లడించారు. ఈ కేసులో ఓ మీడియా సంస్థ ప్రతినిధుల అరెస్టుపై సజ్జనార్ తాజాగా స్పందించారు. మీడియా ప్రతినిధులు అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారని అందుకే వారిని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నామని చెప్పారు. మీడియా ప్రతినిధులు సిట్ విచారణకు సహకరించాలని, పిలిస్తే ఎవరైనా విచారణకు రావాలని, విచారణను ఎదుర్కోకుండా ఎందుకు పారిపోతున్నారని ప్రశ్నించారు. ఈ కేసులో త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తామని, అంతా చట్ట ప్రకారమే చేస్తామని సజ్జనార్ వెల్లడించారు. చట్టం తనపని తాను చేసుకుపోతుందని, ప్రజా జీవితంలో విమర్శలు సహజమని, విమర్శలు కూడా సహేతుకంగా ఉండాలన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అధికారిణిపై వ్యక్తిగత విమర్శలు చేయడం క్రూరత్వమే అవుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారని, అలాంటి వారిపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారని అన్నారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారని మండిపడ్డారు. అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నారాయణపేట జిల్లాలో నమోదైందని, ఈ రెండు కేసులకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ జరుపుతోందని ఆయన తెలిపారు. మీడియా ద్వారా మహిళల ప్రతిష్ఠను దెబ్బతీయడాన్ని ఖండించాలని సజ్జనార్ తెలిపారు. అధికారిణులపై ఉద్దేశపూర్వక దాడులు ఆందోళనకరమని అన్నారు. ప్రజా జీవితంలో మహిళలను అవమానించడం క్రూరత్వమేనని, మహిళా ఉద్యోగులపై వ్యక్తిగత దాడులు ఆమోదయోగ్యం కాదని చెప్పారు. వ్యక్తిత్వంపై దాడి అంటే వారి పురోగతిపై దాడి చేసినట్టే అవుతుందని, స్త్రీలను గౌరవించని సమాజం భవిష్యత్తు దెబ్బతింటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తు అంతా మహిళలదే అని సజ్జనార్ పేర్కొన్నారు.

# మున్సిపల్ రిజర్వేషన్లు ఖరారు

**మొదటి పేజీ తరువాయి**

బీసీ మహిళలకు 19, ఎస్సీ జనరల్ 9, ఎస్సీ మహిళకు 8, ఎస్టీ జనరల్ 3, ఎస్టీ మహిళలకు 2 స్థానాలు కేటాయించింది. ఇక రాష్ట్రంలోని 10 కార్పొరేషన్లలో జనరల్ 1, జనరల్ మహిళలకు 3, బీసీ జనరల్ , బీసీ మహిళ 1, ఎస్సీ, ఎస్టీలకు చెరొకటి చొప్పున స్థానాలు కేటాయించింది. కాగా తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు ఈనెల 17 లోపు నోటిఫికేషన్ వెలువడనుందని సమాచారం.

# తీన్మార్ మల్లన్నకు 'కత్తెర'

**మొదటి పేజీ తరువాయి**

గుర్తుతో! బీసీ బతుకుల చీకటి తెరలను కత్తెరతో తొలగిద్దాం.. కొత్త వెలుగులోకి పయనిద్దాం.. అవినీతిని కత్తిరిద్దాం.. అభివృద్ధికి అడుగులు వేద్దాం. మీ విలువైన ఓటును కత్తెర గుర్తుకే వేయండి. కష్టాలను కత్తిరించే ఆయుధం.. సామాన్యుడి గెలుపుకు సంకేతం మన గుర్తు!' అని పేర్కొన్నారు.

# కెనడా ఉగ్రవాదుల అడ్డా

**40 ఏళ్లుగా మొత్తుకుంటున్నాం**

**అయినా పట్టించుకోలేదు**

**కెనడాపై భారత రాయబారి నిప్పులు**

ఒట్టావా: భారత్, కెనడాల మధ్య నెలకొన్న దౌత్యపరమైన ఉద్రిక్తతలు మరోసారి ముదిరాయి. కెనడా గడ్డపై భారత్‌కు వ్యతిరేకంగా పని చేస్తున్న ఉగ్రవాద శక్తులపై చర్యలు తీసుకోవడంలో ఆ దేశం గత 40 ఏళ్లుగా పూర్తిగా విఫలమైందని కెనడాలోని భారత హైకమిషనర్ దినేష్ పట్నాయక్ ఘాటుగా విమర్శించారు. కెనడా ప్రభుత్వ బ్రాడ్‌కాస్టర్ 'సీబీసీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన కెనడా తీరును తూర్పారబట్టారు. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత ఏజెంట్ల ప్రమేయం ఉందంటూ కెనడా చేస్తున్న ఆరోపణలను పట్నాయక్ గట్టిగా తిప్పికొట్టారు. "ఆరోపణలు చేయడం చాలా సులభం.. కానీ వాటికి బలం చేకూర్చే సాక్ష్యాలెక్కడ?" అని ఆయన ప్రశ్నించారు. భారత ప్రభుత్వం ఇలాంటి అనైతిక చర్యలకు ఎన్నడూ పాల్పడదని, ఒకవేళ ఏదైనా ఆధారాలు చూపిస్తే విచారణ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కానీ కేవలం ఊహాగానాల ఆధారంగా దేశాన్ని నిందించడం సరికాదని హితవు పలికారు. కెనడా ప్రభుత్వం ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ నీతి పాటిస్తోందని ఆయన ఆరోపించారు. 1985లో 329 మంది ప్రాణాలను బలిగొన్న ఎయిర్ ఇండియా (కనిష్క) విమానం పేలుడు ఘటనను ఉదహరిస్తూ.. "40 ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు ఆ కేసులో ఒక్కరిని కూడా శిక్షించలేకపోయారు. మీ గడ్డపై ఉగ్రవాదులు స్వేచ్ఛగా తిరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదు" అని విమర్శించారు. భారత్ తగిన ఆధారాలతో ఉగ్రవాదుల జాబితా ఇచ్చినప్పుడు సాక్ష్యాలు సరిపోవు అని చెప్పే కెనడా.. ఇప్పుడు భారత్‌పై నిరాధారమైన ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు.

# సర్కారుకు అవసరమా?

**సొంత పార్టీపై జగ్గారెడ్డి అహసనం**

**అలా చేయడం మంచిది కాదని వ్యాఖ్య**

సంగారెడ్డి, జనవరి 14 (ఈవార్తలు): అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్టుపై కాంగ్రెస్ సీనియర్ నేత, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల అరెస్ట్‌ను వెంటనే ఆపాలన్న జగ్గారెడ్డి.. సీపీ సజ్జనార్, డీజీపీ శివధర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తూ మీడియాలో వచ్చిన అసత్య కథనాలను ఇప్పటికే ఖండించినట్లు తెలిపారు. వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీస్తూ నాయకులు.. అధికారులపై మీడియాలో ఇష్టానుసారంగా కథనాలను ప్రసారం చేయడం మంచి సంప్రదాయం కాదని చెప్పారు. అయితే మీడియా అనుసరించే కొన్ని చర్యలు.. నాయకులు, అధికారులు సహా ఎవరికైనా ఇబ్బందేనని చెప్పారు. ఇలాంటి వాటిని అందరూ ఖండించాల్సిందేనని అన్నారు. అయితే ఈ కథనాలకు సంబంధించి జర్నలిస్టలను అర్ధరాత్రి అరెస్ట్ చేయడం మంచిది కాదని జగ్గారెడ్డి చెప్పారు. అరెస్టులు చేయకుండా.. జర్నలిస్ట్‌లకు నోటీసులు ఇచ్చి వారి వివరణ తీసుకుంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఇలా జర్నలిస్ట్‌లను అర్ధరాత్రి అరెస్ట్ చేయడం వల్ల.. వారు భయాందోళనలకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. అరెస్ట్ వల్ల రాష్ట్రంలో ఒక యుద్ధ వాతావరణం ఏర్పడే ప్రమాదం ఉందని చెప్పారు. ఇలా జరగడం కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి మంచిది కాదని అభిప్రాయపడ్డారు. జర్నలిస్ట్‌ల అరెస్ట్‌లను వెంటనే ఆపాలన్న ఆయన.. ఈ విషయాన్ని సిట్ బృందం, డీజీపీ పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# తక్షణమే ఇరాన్‌ను వీడండి

**మొదటి పేజీ తరువాయి**

నేపథ్యంలో ఆ దేశంలో నివసిస్తున్న భారతీయులను అక్కడి భారత రాయబార కార్యాలయం అప్రమత్తం చేసింది. అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా ఇరాన్‌ను వీడాలని సూచించింది. "ఇరాన్‌లోని భారత పౌరులు (విద్యార్థులు, పర్యాటకులు, వ్యాపారవేత్తలు) అందుబాటులో ఉన్న విమానాల ద్వారా వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లిపోవాలి" అని పేర్కొంది. తీవ్రమవుతున్న ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల కారణంగా టెహ్రాన్‌తో సహా ఇరాన్‌లోని పలు నగరాల్లో పరిస్థితి మరింత దిగజారిందని రాయబార కార్యాలయం హెచ్చరించింది. నిరసన ప్రదేశాలకు దూరంగా ఉండాలని, జాగ్రత్తగా ఉండాలని సూచించింది. రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదించాలని భారతీయ పౌరులు, భారత సంతతికి చెందిన వ్యక్తులకు తెలిపింది. ఆకస్మిక తరలింపు లేదా అత్యవసర ప్రయాణానికి సిద్ధంగా ఉండాలని తెలిపింది. తక్షణ సహాయం కోసం రాయబార కార్యాలయం అత్యవసర సంప్రదింపు ఫోన్ నెంబర్లను, అధికారిక ఈ-మెయిల్ ఐడీని పంచుకుంది. హెల్ప్‌లైన్ నెంబర్లు 98-9128109115, 98-9128109109, 98-9128109102, 98-9932179359 కాగా, ఈ-మెయిల్ ఐడీ ఎశీఅర్.వష్త్రతీఖుఅఏఎంఖు.స్త్రశీజ.ఱఅ లను పంచుకుంది. తదుపరి నోటీసు వచ్చే వరకు ఆ దేశానికి ప్రయాణం చేయవద్దని భారత విదేశాంగ శాఖ కూడా సూచించింది. విదేశాంగ శాఖ ఇంతకుముందు కూడా ఇలాంటి నోటీసు జారీ చేసింది.

# ఎరగా భార్య!

**భార్యాభర్తల వలపు వల**

**నగ్న వీడియోలతో బ్లాక్‌మెయిల్**

**బెదిరింపులతో రూ.లక్షలు వసూలు**

**100 మంది వరకు బాధితులు**

కరీంనగర్, జనవరి 14 (ఈవార్తలు): వలపు వల విసిరి రూ.లక్షలు దోచేసిన ఓ జంటను కటకటాల్లోకి నెట్టారు పోలీసులు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయాలు పెంచుకొని, వారిని ముగ్గులోకి దించి బ్లాక్‌మెయిల్ చేస్తున్న భార్యాభర్తల దందాను కరీంనగర్ పోలీసులు బట్టబయలు చేశారు. వివరాల్లోకెళితే.. గత రెండేళ్లుగా కరీంనగర్ రూరల్ మండలం ఆరేపల్లిలోని శ్రీ సాయి నివాస అపార్ట్మెంట్‌లో నివసిస్తున్న ఈ దంపతులు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫోటోలు అప్‌లోడ్ చేస్తూ పరిచయాలు పెంచుకునేవారు. అకౌంట్‌ను ఫాలో అయిన వారితో ఫోన్ ద్వారా సంప్రదింపులు పెంచి డబ్బులు తీసుకొస్తే అపార్ట్మెంట్‌కు రావాలని ఆహ్వానించేవారని పోలీసులు వెల్లడించారు. కరీంనగర్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వ్యాపారస్తులు, యువకులు ఇలా అపార్ట్మెంట్‌కు వచ్చినట్లు తేలింది. అపార్ట్మెంట్‌లో బాధితులు ఉన్న సమయంలో భర్త గుట్టుచప్పుడు కాకుండా వారి నగ్న వీడియోలను ఫోన్‌లో రికార్డు చేసి, అనంతరం అవే ఆయుధాలుగా మార్చేవారు. వీడియోలు వైరల్ చేస్తామని బెదిరిస్తూ లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పరువు పోతుందనే భయంతో పలుకుబడి ఉన్న వ్యక్తులు కూడా డబ్బులు చెల్లించినట్లు సమాచారం. వసూలు చేసిన సొమ్ముతో అపార్ట్మెంట్ ఈఎంఐలు చెల్లించడం, టాటా కారు కొనుగోలు చేయడం, ఏసీలు, సోఫా సెట్లు, ఖరీదైన బెడ్స్‌తో విలాసవంతమైన జీవితం సాగించినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఐ నిరంజన్ రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తిని భార్యాభర్తలు పథకం ప్రకారం తమ వలలో పడేసుకున్నారు. సదరు వ్యక్తి వారికి బాగా సన్నిహితంగా మారి భర్తతో కలిసి మద్యం సేవిస్తూ మహిళతో ఎక్కువసార్లు గడిపాడని తెలిపారు. ఈ క్రమంలో మాయ మాటలతో అపార్ట్మెంట్, కారు ఈఎంఐలు కూడా అతనితోనే చెల్లింపులు చేయించినట్లు పేర్కొన్నారు. డబ్బులు అయిపోవడంతో బాధితుడు కొంతకాలంగా రావడం మానేయగా వాట్సాప్ కాల్స్ ద్వారా ఒత్తిడి పెంచినట్లు సీఐ తెలిపారు. తన వద్ద ఇక డబ్బులు లేవని వదిలేయాలని కోరినా రూ.5 లక్షలు ఇస్తేనే మర్చిపోతామని డిమాండ్ చేసినట్లు వెల్లడించారు. డబ్బులు ఇవ్వకపోతే అతని నగ్న వీడియోలను కుటుంబ సభ్యులకు పంపుతామని చంపుతామని కూడా బెదిరించినట్లు తెలిపారు. భయంతో చివరకు బాధితుడు లక్ష రూపాయలు ఇవ్వడానికి ఒప్పుకుని శ్రీపురం కాలనీ బోర్డు వద్ద నగదు అప్పగించాడని సీఐ నిరంజన్ రెడ్డి వివరించారు. మిగిలిన రూ.4 లక్షలు రెండు రోజుల్లో పంపిస్తానని చెప్పిన బాధితుడు ఇప్పటివరకు మొత్తం రూ.14 లక్షల వరకు ఇచ్చానని ఇక తనను వేధించవద్దని వీడియోలను తొలగించాలని వేడుకున్నట్లు తెలిపారు.

## బ్లాక్‌మెయిల్ దందాకుఖీ బ్రేక్

వేధింపులు తాళలేక బాధితుడు బంధువులు, సన్నిహితులకు జరిగిన విషయం వెల్లడించగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని వారు సూచించినట్లు సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు ఫోన్‌పే ద్వారా భార్యాభర్తలకు చెల్లించిన డబ్బులకు సంబంధించిన ఆధారాలు సమర్పించడంతో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఏసీపీ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు రూరల్ పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టగా బుధవారం ఉదయం టేస్టీ దాబా వద్ద ఫోన్‌లో మాట్లాడుతుండగా అనుమానాస్పదంగా కనిపించిన భార్యాభర్తలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. బాధితులను నగ్నంగా చిత్రీకరించిన వీడియోలు ఉన్న మొబైల్ ఫోన్లు, బాధితుడు ఇచ్చిన చెక్కును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించాలని కోర్టు ఆదేశించినట్లు వెల్లడించారు. నిందితులైన భార్యాభర్తలు మంచిర్యాల జిల్లాకు చెందినవారని వారికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారని సీఐ నిరంజన్ రెడ్డి వివరించారు. గత కొంతకాలంగా కరీంనగర్‌లో నివసిస్తూ సోషల్ మీడియా వేదికగా బ్లాక్‌మెయిల్ దందా సాగించినట్లు తెలిపారు. కేసును 24 గంటల్లోనే ఛేదించిన రూరల్ పోలీస్ సిబ్బందిని ఏసీపీ విజయ్ కుమార్ అభినందించారు.

# భారత విద్యార్థులపై నిఘా

**ఆస్ట్రేలియా వీసా నిబంధనలు కఠినతరం**

**కేరళ 10 లక్షల ఫేక్ సర్టిఫికెట్ల ఎఫెక్ట్**

సిడ్నీ: ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియా వెళ్లాలనుకునే భారతీయ విద్యార్థులకు ఇకపై వీసా రావడం అంత సులభం కాదు. తాజాగా ఆస్ట్రేలియా ప్రభుత్వం భారత్‌ను హై-రిస్క్ (అసెస్‌మెంట్ లెవల్ 3) కేటగిరీలోకి మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు లెవల్ 2లో ఉన్న భారత్‌ను, రిస్క్ ఎక్కువగా ఉండే పాకిస్థాన్ వంటి దేశాల జాబితాలోకి చేర్చడం గమనార్హం. జనవరి 8, 2026 నుంచే ఈ కొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయి. ఇటీవల భారతదేశంలో, ముఖ్యంగా కేరళలో వెలుగుచూసిన భారీ నకిలీ సర్టిఫికెట్ల కుంభకోణం ఆస్ట్రేలియా ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రభావితం చేసినట్లు తెలుస్తోంది. సుమారు 10 లక్షల మందికి 22 యూనివర్సిటీల పేరుతో నకిలీ పత్రాలు సరఫరా అయినట్లు నివేదికలు వచ్చాయి. ఆస్ట్రేలియాలో ఇప్పటికే వేల సంఖ్యలో విద్యార్థులు కొనుగోలు చేసిన డిగ్రీలతో ఉన్నారని ఆ దేశ సెనేటర్ మాల్కం రాబర్ట్స్ ఆరోపించారు. ఈ 'ఇంటిగ్రిటీ' సమస్యల వల్లే నిఘా పెంచినట్లు ప్రభుత్వం పేర్కొంది. కొత్త నిబంధనల ప్రకారం, దరఖాస్తుదారులు కేవలం పత్రాలను సమర్పిస్తే సరిపోదు. అధికారులు ఆ పత్రాల వెనకున్న నిజాన్ని తనిఖీ చేస్తారు. బ్యాంక్ స్టేట్‌మెంట్లను నేరుగా సదరు బ్యాంకులతో సంప్రదించి ధ్రువీకరించుకుంటారు. గతంలో చదివిన విద్యాసంస్థలకు ఫోన్ చేసి మార్కుల జాబితాలను క్రాస్ చెక్ చేస్తారు. అలాగే, ఇంగ్లిష్ భాషా నైపుణ్యానికి సంబంధించి మరిన్ని పక్కా ఆధారాలు చూపాల్సి ఉంటుంది. దక్షిణాసియా దేశాలపై ప్రభావం కేవలం భారత్ మాత్రమే కాకుండా నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్ దేశాలను కూడా ప్రభుత్వం ఏఎల్3 కేటగిరీలోకి మార్చింది. ఆస్ట్రేలియాలో ఉన్న మొత్తం 6.5 లక్షల మంది విదేశీ విద్యార్థులలో భారతీయులే 1.4 లక్షల మంది ఉన్నారు. అమెరికా, బ్రిటన్, కెనడాతో పోలిస్తే తమ దేశమే ఇప్పటికీ విద్యార్థులకు మెరుగైన ఎంపికని ఆస్ట్రేలియా విద్యాశాఖ మంత్రి జూలియన్ హిల్ సమర్థించుకున్నారు. అయితే, ఈ మార్పులు తాత్కాలికమా లేక దీర్ఘకాలికంగా కొనసాగుతాయా అన్నది వేచి చూడాలి.



## కూకట్‌పల్లి నల్లచెరువులో

# హైడ్రా పతంగుల పండుగ

**పతంగి ఎగరేసి వేడుకలను ప్రారంభించిన ఏవీ రంగనాథ్**

కూకట్‌పల్లి/హైదరాబాద్, జనవరి 14 (ఈవార్తలు): కూకట్‌పల్లిలోని నల్లచెరువు వద్ద బుధవారం పండుగ వాతావరణం నెలకొంది. ఒకప్పుడు మురికి, దుర్గంధంతో నిండిన ఈ ప్రాంతం ఇప్పుడు పతంగుల పండుగతో సందడిగా మారింది. స్థానికుల ఆహ్వానం మేరకు ఈ కైట్ ఫెస్టివల్‌కు ముఖ్య అతిథిగా హాజరైన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, స్వయంగా పతంగి ఎగురవేసి వేడుకలను ప్రారంభించారు. పిల్లలు, యువకులతో కలిసిపోయి ఉత్సాహంగా పతంగిని గాలిలోకి వదిలిన ఆయన, తన బాల్య, యవ్వన స్మృతులను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ, "2024 సెప్టెంబరులో చెరువు విస్తరణ పనులు ప్రారంభించినప్పుడు ఇక్కడ తీవ్ర నిరసనలు ఎదుర్కొన్నాం. కానీ ఈ రోజు ఇక్కడి ప్రజల ముఖాల్లో ఆనందం, పండుగ వాతావరణం చూడటం ఎంతో సంతోషంగా ఉంది" అని అన్నారు. కబ్జాల కారణంగా 16 ఎకరాలకు కుంచించుకుపోయిన నల్లచెరువును, పూడికతీత పనులు చేపట్టి ఏకంగా 30 ఎకరాలకు విస్తరించామని తెలిపారు. దాదాపు 10 అడుగుల లోతు పేరుకుపోయిన పూడికను తొలగించి, చెరువు లోతు పెంచడం ద్వారా చుట్టుపక్కల ప్రాంతాల్లో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని వివరించారు. "కేవలం పైపై మెరుగులు దిద్దడం కాదు, చెరువుల అభివృద్ధి అంటే ఎలా ఉండాలో చేసి చూపించాం. ఇప్పుడు ఈ చెరువును చూస్తుంటే ఎంతో ఆహ్లాదంగా ఉంది. 5 కిలోమీటర్ల దూరం నుంచి కూడా ప్రజలు ఇక్కడికి వాకింగ్ కోసం వస్తున్నారని తెలిసి చాలా ఆనందించాను" అని అన్నారు. త్వరలోనే ఈ చెరువు వద్ద షటిల్ కోర్టు, కమ్యూనిటీ హాల్, యోగా కేంద్రం, సైకిల్ ట్రాక్, పికిల్ బాల్ వంటి క్రీడా సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తామని, వీటన్నింటినీ ప్రజలు ఉచితంగా వినియోగించుకోవచ్చని రంగనాథ్ హామీ ఇచ్చారు. హైడ్రా ఆధ్వర్యంలో మొదటి విడతలో 6 చెరువుల అభివృద్ధి చేపట్టగా, ఇప్పటికే బతుకమ్మకుంటను ప్రారంభించామని, మరో 3 చెరువులను ఫిబ్రవరిలోగా ప్రారంభిస్తామని చెప్పారు. వీటికి అదనంగా మరో 14 చెరువులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, త్వరలోనే ఆ పనులు కూడా మొదలుపెడతామని ప్రకటించారు. నగరంలో వంద చెరువులను అభివృద్ధి చేస్తే వరదలను నియంత్రించవచ్చని, భూగర్భ జలాలు పెరిగి మంచి నీరు అందుబాటులోకి వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. చెరువు అభివృద్ధి పట్ల స్థానిక నివాసితులు హర్షం వ్యక్తం చేశారు. "చెరువును ఈ స్థాయిలో అభివృద్ధి చేస్తారని మేము కలలో కూడా ఊహించలేదు. దుర్గంధభరిత వాతావరణాన్ని తొలగించి ఆహ్లాదాన్ని నింపిన ప్రభుత్వానికి, హైడ్రాకు మా కృతజ్ఞతలు" అని వారు తెలిపారు. చిన్నారులందరూ కమిషనర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పగా, ఆయన వారికి స్వీట్స్ పంచిపెట్టి ఆనందాన్ని పంచుకున్నారు.





# కేసీఆర్‌ను తిట్టేందుకు కవిత చాలు

**మేం అవసరం లేదు: కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



దేవరకద్ర, జనవరి 14 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీని, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌ను విమర్శించేందుకు తాము అవసరం లేదని, ఆయన కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సరిపోతారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేస్తే, వాటిని తమ ప్రభుత్వం తీర్చే ప్రయత్నం చేస్తోందని అన్నారు. అప్పులు తీరుస్తూనే రాష్ట్ర అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కేసీఆర్ వల్ల పాలమూరుకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.80 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉండగా, రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే 90 శాతం పనులు ఎలా పూర్తవుతాయో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పి మోసాలు చేయాలని చూస్తే, ప్రజలు ఇచ్చిన తీర్పును గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని ఆయన ప్రశంసించారు. కేసీఆర్ మాత్రం ఏదో ఒకరోజు మాత్రమే పనుల కోసం సమయం కేటాయించారని విమర్శించారు. అందుకే అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. వివిధ పథకాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని తెలిపారు. మరో ఇరవై రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయని, ఆ ఎన్నికల్లో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు లేని పార్టీలకు ఓటు వేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని ఆయన అన్నారు. పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 40 శాతం సర్పంచ్ స్థానాలను గెలిచామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెబుతున్నారని, పార్టీ గుర్తుతో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో గెలవాలని ఆయన సవాల్ విసిరారు.



## జర్నలిస్టుల అరెస్టు అప్రజాస్వామికం: కిషన్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 14 (ఈవార్తలు): జర్నలిస్టుల అరెస్టుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ.. తెలంగాణలో జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అత్యంత అనైతికం, అప్రజాస్వామికమని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో జర్నలిజం నాలుగో స్తంభం వంటిదని, అలాంటి వ్యవస్థ పై దాడులు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. సిట్ విచారణ కొనసాగుతున్న తరుణంలో, కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా జర్నలిస్టుల ఇళ్లపై దాడులు చేయడం, తలుపులు పగలగొట్టి మరీ అరెస్టులు చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ పూర్తయిన తర్వాత అన్ని అంశాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలి తప్ప, ఇలా ముందస్తు అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురిచేయడం తగదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అసలు తాము ఏర్పాటు చేసిన సిట్ విచారణపై నమ్మకం లేదా అని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ప్రశ్నించారు. చట్టం తన పని తాను చేసుకుపోవాలి కానీ, రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. జర్నలిస్టులను ఉగ్రవాదుల మాదిరిగా అర్ధరాత్రి పూట అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం ఏం సంకేతాలు ఇవ్వాలనుకుంటోందని ఆయన నిలదీశారు. తక్షణమే అక్రమ అరెస్టులను నిలిపివేసి, మీడియా స్వేచ్ఛను గౌరవించాలని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# తలసానిపై కేసు

**సీఎం రేవంత్‌పై వ్యాఖ్యల నేపథ్యంలో నమోదు**



ఎస్ఆర్‌నగర్/హైదరాబాద్, జనవరి 14 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, సనత్‌నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై కేసు నమోదైంది. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నేత రవి కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌లోని ఎస్సార్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో తలసాని మాట్లాడారు. సికింద్రాబాద్‌ను ముక్కలు చేయాలని చూస్తే నిన్ను ముక్కలు చేస్తాం అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆయన హెచ్చరికలు జారీ చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు, తలసాని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వివాదం ముదరడంతో తలసాని శ్రీనివాస్ యాదవ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కేవలం ఆవేశంలోనే ఆ మాటలు అన్నానని, ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని వివరణ ఇచ్చారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిని తాను గౌరవిస్తానని తెలిపారు. అయినప్పటికీ, కాంగ్రెస్ నేత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జీహెచ్ఎంసీ విభజనను వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపడతామని తలసాని ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

## అల్వాల్ కార్ల షోరూంలో అగ్నిప్రమాదం

**ట్రూ వ్యాల్యూ షోరూంలో చెలరేగిన మంటలు**

అల్వాల్/హైదరాబాద్, జనవరి 14 (ఈవార్తలు): హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అల్వాల్‌లోని ట్రూ వ్యాల్యూ కార్ల షోరూంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో వెంటనే స్పందించిన కార్ల షోరూం సిబ్బంది, స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. తక్షణమే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రెండు ఫైరింజన్ల సహాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా నల్లటి పొగతో కమ్ముకుపోయింది. ఈ దుర్ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ, ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.





## చైనా మాంజాకు మరో వ్యక్తి బలి

**సంగారెడ్డిలో చైనా మాంజా వల్ల యూపీ వాసి మృతి**

సంగారెడ్డి, జనవరి 14 (ఈవార్తలు): సంక్రాంతి పండుగ వేళ తెలంగాణలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నిషేధిత చైనా మాంజా ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొంది. సంగారెడ్డి జిల్లాలో బుధవారం జరిగిన ఈ దుర్ఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అవిదేశ్ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అవిదేశ్ మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తుండగా గాలిపటం దారమైన చైనా మాంజా అతడి మెడకు చుట్టుకుంది. దీంతో గొంతుకు తీవ్రమైన గాయం కావడంతో అధిక రక్తస్రావమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత కొద్ది వారాలుగా హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.




## ములుగు జిల్లాను తొలగించం: సీతక్క

ములుగు, జనవరి 14 (ఈవార్తలు): ములుగు జిల్లాను తొలగిస్తున్నారంటూ జరుగుతోన్న ప్రచారంపై మంత్రి సీతక్క స్పందించారు. తెలంగాణలో ఇటీవల జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశం చర్చకు దారి తీసింది. వివిధ జిల్లాలు రద్దవుతున్నాయంటూ ఆయా జిల్లాల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. అయితే, ఈ ప్రచారాన్ని ఆయా జిల్లాలకు సంబంధించిన అధికార పార్టీ నాయకులు ఎప్పటికప్పుడు ఖండిస్తున్నారు. జనగామ జిల్లా రద్దవుతోందంటూ రెండు రోజుల క్రితం ప్రచారం జరగగా, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఖండించారు. తాజాగా ములుగు జిల్లాపై అలాంటి ప్రచారం సాగుతోంది. ములుగు జిల్లాను తొలగిస్తున్నారని జరుగుతోన్న ప్రచారాన్ని విశ్వసించవద్దని మంత్రి సీతక్క అన్నారు. పలు యూట్యూబ్ ఛానళ్ల ద్వారా జిల్లాపై తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై, కాంగ్రెస్ పార్టీపై బురద జల్లేందుకే ఈ విధంగా ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జిల్లాల పునర్విభజన శాస్త్రీయంగా జరగలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారని గుర్తు చేశారు. అందుకే మరోసారి జిల్లాల పునర్విభజన గురించి ముఖ్యమంత్రి మాట్లాడారని తెలిపారు. ములుగు జిల్లా అభివృద్ధిపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని ఆమె తెలిపారు. ఎందరో పోరాటాలు, త్యాగాల వల్ల ములుగు జిల్లా ఏర్పడిందని అన్నారు.

## దౌర్జన్యం అవసరమా?

**నోటీసులు ఇస్తే సరిపోతుంది కదా: కేటీఆర్**



హైదరాబాద్, జనవరి 14 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ముగ్గురు జర్నలిస్టులను పోలీసులు అపహరించారని ఆరోపిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో మీడియాపై దమనకాండ కొనసాగుతోందని ధ్వజమెత్తారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆయన ఘాటుగా స్పందించారు. 'రాహుల్ గాంధీ గారూ.. మీరు నడుపుతున్న 'మొహబ్బత్ కీ దుకాన్'ల తెలంగాణ శాఖ, పౌరుల రాజ్యాంగ హక్కులను ఎలా కాలరాస్తోందో గమనిస్తున్నారని ఆశిస్తున్నా' అని కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. మంగళవారం రాత్రి రాష్ట్ర పోలీసులు ముగ్గురు జర్నలిస్టులను అపహరించారని, ఒకరి ఇంటి తలుపులు బద్దలుకొట్టి మరీ లోపలికి ప్రవేశించారని ఆరోపించారు. కేవలం బెయిల్ ఇవ్వదగిన సెక్షన్లు ఉన్న కేసులో, బీఎన్ఎస్ సెక్షన్ 35 ప్రకారం నోటీసులు ఇస్తే సరిపోయేదానికి ఇంత దౌర్జన్యం అవసరమా అని ఆయన ప్రశ్నించారు. మీడియా, డిజిటల్ మీడియాపై ఈ తరహా అణచివేత ధోరణి ఇప్పుడు రేవంత్ రెడ్డి పాలనకు ఒక నమూనాగా మారిందని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

## భర్తకు అప్పులు..దొంగగా భార్య

సనత్‌నగర్/హైదరాబాద్, జనవరి 14 (ఈవార్తలు): వ్యాపారంలో నష్టపోయి అప్పుల పాలైన భర్త కోసం తాను కూడా కష్టపడాలని, డబ్బు సంపాదించాలని భార్య నిర్ణయించుకుంది.. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించడానికి దొంగగా మారింది. ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లింది. హైదరాబాద్ లోని సనత్ నగర్ ప్రాంతం అవంతీనగర్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. అరగంటలోనే దొంగను పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ కు చెందిన అనితా రెడ్డి ఉన్నత చదువులు చదివి చెన్నైలో కొంతకాలం సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేసింది. మేడ్చల్ కు చెందిన రాజేశ్ తో రెండేళ్ల క్రితం ఆమెకు వివాహం జరిగింది. ఈ దంపతులకు ఓ పాప ఉంది. రాజేశ్ చేస్తున్న ఫైనాన్స్ వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చేందుకు భర్త పడుతున్న బాధను చూడలేక తాను కూడా డబ్బు సంపాదించాలని అనిత దొంగగా మారింది. ఈ నెల 13న అవంతీనగర్ లో ఓ వృద్ధురాలిని వెంబడించిన అనిత.. బిల్డింగ్ లిఫ్ట్ లో ఆమె మెడలోని మంగళసూత్రం కొట్టేసి పారిపోయింది. బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించిన పోలీసులు అనితను గుర్తించి అరగంటలోనే అదుపులోకి తీసుకున్నారు. భర్త చేసిన అప్పులు తీర్చడానికే దొంగతనం చేసినట్లు అనిత పోలీసులకు వెల్లడించింది.

## వ్యక్తిత్వ హననం చేస్తే చర్యలు తప్పవు: డీజీపీ

హైదరాబాద్, జనవరి 14 (ఈవార్తలు): చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి హెచ్చరించారు. మహిళా ఐఏఎస్ అధికారి గౌరవానికి భంగం కలిగించేలా ఓ టీవీ ఛానల్, యూట్యూబ్ ఛానళ్లలో కథనాలు ప్రసారమైన నేపథ్యంలో డీజీపీ స్పందించారు. 'సోషల్ మీడియా అత్యుత్సాహంపై గతంలోనే హెచ్చరించాం. సోషల్ మీడియా పేరుతో వ్యక్తిత్వ హననం చేస్తే చర్యలు తప్పవు. వ్యక్తులు, కుటుంబాల గురించి తప్పుడు వార్తలు వేయవద్దు. వ్యక్తిగత అంశాలపై ఫేక్ న్యూస్ ప్రచారం చేయకూడదు' అని పేర్కొన్నారు.





## కన్నుల పండువగా భోగి పండుగ

జగిత్యాల పట్టణంలో బైపాస్ రోడ్‌లో గల అష్టలక్ష్మీనగర్ కాలనీలో అష్టలక్ష్మీఅబశ్రీశ్రీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. అటు.. మల్యాల కేంద్రంలోని నవదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు భోగి మంటల చుట్టూ కోలాటం ఆడారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి, అమ్మవారికి 108 రకాల నైవేద్యాలు సమర్పించారు.



## మానాల నర్సన్న జాతరకు విరాళాల అభ్యర్థన

మల్యాల, జనవరి 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని మానాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరగబోయే జాతర పనుల కోసం దాతలు ముందుకు రావాలని ఆలయ అభివృద్ధి కమిటీ కోరింది. లైటింగ్, పూల డెకరేషన్, చలువ పందిళ్ళు, అన్నదానం, పెయింటింగ్, తాగునీరు, వాల్ పోస్టర్స్, పూజ సామాను తదితర పనులకు సంబంధించిన దాతలు కావాలని విన్నవించింది. ఆసక్తి ఉన్న భక్తులు 7093714693 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# జర్నలిస్టుల అరెస్టును ఖండిస్తున్నా: జగన్



తాడేపల్లి, జనవరి 14 (ఈవార్తలు): తెలంగాణలో ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్ట్‌ను వైసీపీ అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. ఈ చర్య పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. పండుగ సమయంలో అర్ధరాత్రి పూట ఇళ్ల తలుపులు బద్దలుకొట్టి, ఎలాంటి చట్టపరమైన ప్రక్రియను పాటించకుండా, కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా జర్నలిస్టులను అరెస్ట్ చేయడం అత్యంత దారుణమని మండిపడ్డారు. ఇది ప్రభుత్వ నిరంకుశ ధోరణికి స్పష్టమైన నిదర్శనమని జగన్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ, "జర్నలిస్టులు నేరస్తులు కాదు, ఉగ్రవాదులు అంతకన్నా కాదు. అయినా వారి పట్ల ఇంత కఠినంగా వ్యవహరించడం సరికాదు. ఇలాంటి చర్యల వల్ల వారి కుటుంబ సభ్యులు తీవ్రమైన మానసిక వేదనకు గురవుతారు. అంతేకాకుండా, మీడియా వర్గాలలో భయాందోళనకర వాతావరణం నెలకొంటుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా ఉందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలని జగన్ హితవు పలికారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వం రాజ్యాంగాన్ని గౌరవించాలని, చట్టబద్ధమైన పాలనను కొనసాగించాలని, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలని జగన్ గట్టిగా డిమాండ్ చేశారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, కానీ చట్టాన్ని అమలు చేసే విధానంలో హుందాతనం, పారదర్శకత ఉండాలని సూచించారు. జర్నలిస్టుల హక్కులను కాలరాయడం ద్వారా ప్రజాస్వామ్యానికి నష్టం కలిగించవద్దని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



## కొండగట్టులో ఘనంగా గోదా కల్యాణోత్సవం

మల్యాల, జనవరి 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం శ్రీగోదా రంగనాథ స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. పురవీధుల్లో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కన్నులపండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముత్యంపేట గ్రామసర్పంచ్, వార్డు మెంబర్లు, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారని ఆలయ ఈవో శ్రీకాంతారావు తెలిపారు.

# కూటమి సర్కారులో పండుగే లేదు: రోజా

నగరి, జనవరి 14 (ఈవార్తలు): వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా నగరి నియోజకవర్గంలోని తన నివాసంలో భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి భోగి సంబరాల్లో పాల్గొన్నారు. భోగి సందర్భంగా ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భోగి పండుగ పాతదాన్ని దహనం చేసి కొత్తదాన్ని ఆహ్వానించే సందర్భమని, మన జీవితాల్లోని చెడు, బాధలను కూడా ఆ మంటల్లో కాల్చేసి కొత్త వెలుగులు, కొత్త ఆశలు,కొత్త ప్రారంభాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇదే సమయంలో ఆమె రాజకీయ విమర్శలు గుప్పించారు. జగన్ హయాంలో పేదలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిలిపివేసిందని ఆరోపించారు. పేదల చేతుల్లో డబ్బులు లేక పండుగ ఆనందంగా జరుపుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి అనేది రైతన్నలకు పంట చేతికొచ్చి చేతినిండా డబ్బులు ఉండే పండుగ అని అన్నారు. కానీ, ఇప్పుడు రబీకి ఆర్థిక సహాయం కూడా అందకపోవడం, ప్రభుత్వం ఇస్తామన్న రూ.40 వేలలో కేవలం రూ.10 వేలు మాత్రమే ఇవ్వడం, వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం లేకపోవడం వల్ల రైతన్నలు సంతోషంగా పండుగ జరుపుకోలేకపోతున్నారని ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. జగన్ హయాంలో రైతులు ఎంతో సంతోషంగా ఉండేవారని అన్నారు. వైద్యరంగాన్ని ప్రైవేట్‌పరం చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనికి సంబంధించిన జీవోలను రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ శ్రేణులు భోగి మంటల్లో దగ్ధం చేశారని వెల్లడించారు. నగరి నియోజకవర్గంలో అత్యధికంగా చేనేత కార్మికులు ఉన్నారని, వారికి ఉచితంగా కరెంట్ ఇవ్వాలని, పవర్‌లూమ్‌లకు కరెంట్ చార్జీలు తగ్గించాలని రోజా డిమాండ్ చేశారు.



# ఏపీకి 567 కోట్లు విడుదల

అమరావతి, జనవరి 14 (ఈవార్తలు): ఏపీలోని ఎన్డీయే ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఆరోగ్య రంగానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు ఆఖరి విడతగా రూ. 567 కోట్ల గ్రాంటును కేంద్రం విడుదల చేసింది. ఈ విషయాన్ని ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ... గత 19 నెలల కాలంలో 15వ ఆర్థిక సంఘం నిధుల్లో 48 శాతం మేర నిధులను వినియోగించడం జరిగిందని తెలిపారు. ఏపీలోని కూటమి ప్రభుత్వంలో నిధుల వినియోగం పెరగడం పట్ల కేంద్ర ప్రభుత్వం సంతృప్తిని వ్యక్తం చేసిందని చెప్పారు. ఇది, ఏపీ ప్రభుత్వానికి కేంద్రం గుర్తింపును ఇచ్చినట్టేనని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆరోగ్య రంగం మరింత బలోపేతం కావడానికి ఈ నిధులు ఉపయోగపడతాయని మంత్రి చెప్పారు. రాష్ట్రానికి రావాల్సిన మిగుల నిధుల కోసం కేంద్ర ఆర్థిక శాఖతో వెంటనే చర్చలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి అన్ని రకాలుగా, పూర్తి స్థాయిలో ఆర్థిక సాయాన్ని సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రుల బలోపేతం, ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిగా పొందిన మూడవ రాష్ట్రంగా ఏపీ అవతరించిందని చెప్పారు.



# ఏపీలో కోడి పందాల జోరు

**పశ్చిమ గోదావరి జిల్లాలో ఏపీ డిప్యూటీ స్పీకర్ సహా పలు నేతల సందడి**

**పందెం రాయుళ్లు, ప్రేక్షకులతో పలు జిల్లాల్లో కోలాహలం**

వైజాగ్, జనవరి 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ లో సంక్రాంతి వేడుకల్లో కోడిపందాలదే ప్రధాన సందడని చెప్పడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు పలుచోట్ల ఏటా సంక్రాంతి పండుగకు కోడిపందాలు నిర్వహిస్తుంటారు. ఈ పందాలను చూడడానికి తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల నుంచి జనం వస్తుంటారని స్థానికులు చెబుతున్నారు. ఈసారి పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించిన కోడి పందాలలో ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులతో పాటు హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి పాల్గొని సందడి చేశారు. జిల్లాలోని కాళ్ల మండలం పెదఅమిరంలో జరిగిన ఈ పోటీలలో పాల్గొన్న నేతలు.. పందెం కోళ్లతో ఫొటోలకు ఫోజులిచ్చారు. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, పోలవరం, కృష్ణా జిల్లాల్లో కోడి పందాలు భారీ ఎత్తున జరుగుతున్నాయి. బరుల వద్ద పందెం రాయుళ్లు, ప్రేక్షకులతో కోలాహలం నెలకొంది.

# అల్లూరి జిల్లాలో ముగ్గురు యువకులు మృతి

అల్లూరి జిల్లా, జనవరి 14 (ఈవార్తలు): సంక్రాంతి పండుగ సందర్భంగా ఏపీలోని అల్లూరి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. బుధవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. అరకు మండలం చెంజీపూర్ వద్ద ఎదురెదురుగా అతివేగంగా వచ్చిన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఘటనలో బురిడి నిరంజన్, కిలో ముష్యా, కిలో గంగబాబు ఘటన స్థలంలోనే దుర్మరణం చెందారు. ముగ్గురి మరణంతో వారి కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.



## కిడ్నీ బాధితుడికి టీఈఏ బృందం భారీ సాయం

మల్యాల, జనవరి 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాలకు చెందిన గడికొప్పుల మహేశ్ (32) గత కొన్ని రోజులుగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ యూరప్ అసోసియేషన్ (టీఈఏ), భారత్‌లోని స్నేహితులు కలిసి బాధిత కుటుంబానికి భారీ సహాయం అందజేశారు. బుధవారం కుటుంబసభ్యులను కలిసి రూ.1,36,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మరోవైపు, ఇటీవల చనిపోయిన మంద నాగన్న గౌడ్ కుటుంబానికి గౌడ యువకుల సంఘం రూ.15 వేల సాయం అందించారు.

## 16న శ్రీఅబశ్రీశ్రీవారి పార్వేట ఉత్సవం

తిరుమల, జనవరి 14 (ఈవార్తలు): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి పార్వేట ఉత్సవం సందర్భంగా కనుమ రోజున నిర్వహించే గోదా పరిణయోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జనవరి 16న శ్రీవారి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం , సహస్రదీపాలంకార సేవలను రద్దు చేసినట్లు వెల్లడించారు. గోదా పరిణయోత్సవం సందఅబశ్రీశ్రీర్భంగా ఉదఅబశ్రీశ్రీయం 5.30 నుంచి 6.30 గంటఅబశ్రీశ్రీలఅబశ్రీశ్రీకు ఆండాళ్ అమ్మవారి మాలఅబశ్రీశ్రీలఅబశ్రీశ్రీను శ్రీఅబశ్రీశ్రీశ్రీఅబశ్రీశ్రీశ్రీ పెద్ద జీయ్యర్‌స్వామి మఅబశ్రీశ్రీఠం నుంచి ఆలఅబశ్రీశ్రీయ నాలుగు మాడ వీధులఅబశ్రీశ్రీలో ఊరేగింపుగా శ్రీఅబశ్రీశ్రీవారి ఆలఅబశ్రీశ్రీయానికి తీసుకు వెళ్ళి స్వామివారికి సఅబశ్రీశ్రీమఅబశ్రీశ్రీర్పించడం జరుగుతుందని వివరించారు. అనంతఅబశ్రీశ్రీరం మధ్యాహ్నం 1 గంటకు మలయప్పస్వామి, కృష్ణస్వామి మూర్తులను పార్వేట మండపానికి తీసుకొచ్చి ఆస్థానం, పారువేట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

# భారత పాస్‌పోర్టు మరింత మెరుగు

## హెన్లీ ఇండెక్స్‌లో ఐదు స్థానాలు జంప్.. 80వ స్థానంలో నిలిచిన భారత్

**అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌గా సింగపూర్**

న్యూఢిల్లీ: ప్రపంచ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్స్‌లో భారత్ తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకుంది. ప్రతిష్ఠాత్మక హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2026 నివేదిక ప్రకారం, భారత పాస్‌పోర్ట్ గతంతో పోలిస్తే ఐదు స్థానాలు ఎగబాకి 80వ ర్యాంకులో నిలిచింది. దీంతో భారత పౌరులు వీసా లేకుండా లేదా వీసా-ఆన్-అరైవల్ పద్ధతిలో 55 దేశాలకు ప్రయాణించేందుకు అవకాశం లభించింది. అల్జీరియా, నైజర్ దేశాలు కూడా భారత్‌తో పాటు ఇదే ర్యాంకును పంచుకున్నాయి. ఈ జాబితాలో సింగపూర్ అగ్రస్థానంలో నిలిచి, ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌గా తన స్థానాన్ని నిలబెట్టుకుంది. సింగపూర్ పాస్‌పోర్ట్ ఉన్నవారు 192 దేశాలకు వీసా లేకుండా వెళ్లగలరు. జపాన్ (188 దేశాలు), దక్షిణ కొరియా ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఒక దేశం యొక్క ఆర్థిక శక్తికి, దాని పౌరుల ప్రయాణ స్వేచ్ఛకు మధ్య ఉన్న సంబంధాన్ని ఈ ర్యాంకులు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం భారత ప్రయాణికులు ఆగ్నేయాసియా, ఆఫ్రికా, కరేబియన్ దీవులతో పాటు మరికొన్ని దేశాలకు వీసా లేకుండా వెళ్లే వెసులుబాటు ఉంది. అయితే, చాలా యూరప్ దేశాలు, యూకే, అమెరికా, కెనడా వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే ముందుగానే వీసా తప్పనిసరి. ఈ జాబితాలో ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్ట్ అత్యంత బలహీనమైనదిగా చివరి స్థానంలో ఉంది. ఆ దేశ పౌరులు కేవలం 24 దేశాలకు మాత్రమే వీసా రహితంగా ప్రయాణించగలరు. "గత 20 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా ప్రయాణ స్వేచ్ఛ పెరిగినప్పటికీ, దాని ప్రయోజనాలు అందరికీ సమానంగా అందడం లేదు" అని హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ ఛైర్మన్ డాక్టర్ క్రిస్టియన్ హెచ్. కెలిన్ తెలిపారు. ఆర్థికంగా, రాజకీయంగా శక్తిమంతమైన దేశాలకే ప్రయాణ స్వేచ్ఛ అవకాశాలు ఎక్కువగా దక్కుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా, గత 20 ఏళ్లలో




అత్యధికంగా తన ర్యాంకును మెరుగుపరుచుకున్న దేశంగా యూఏఈ నిలిచింది. 2006 నుంచి 149 వీసా రహిత దేశాలను అదనంగా చేర్చుకుని, 57 స్థానాలు ఎగబాకి 5వ ర్యాంకుకు చేరింది.

# అమెరికాలో పాలక్ పన్నీర్ గెలిచింది!

**1.8 కోట్ల దావా గెలిచిన ఇండియన్ స్టూడెంట్స్**

-న్యూయార్క్: అమెరికాలో జాతి వివక్షపై ఇద్దరు భారతీయ పీహెచ్‌డీ విద్యార్థులు చేసిన న్యాయపోరాటం ఫలించింది. తాము తెచ్చుకున్న భోజనం వాసనపై మొదలైన వివాదంలో యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో బౌల్డర్‌పై వారు వేసిన కేసులో విజయం సాధించారు. సెటిల్‌మెంట్‌లో భాగంగా వర్సిటీ నుంచి 2,00,000 డాలర్లు (సుమారు రూ.1.8 కోట్లు) పరిహారం పొందారు. వివరాల్లోకి వెళితే, భోపాల్‌కు చెందిన ఆదిత్య ప్రకాశ్ (34), కోల్‌కతాకు చెందిన ఊర్మి భట్టాచార్య (35) కొలరాడో యూనివర్సిటీలోని ఆంత్రోపాలజీ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. 2023 సెప్టెంబర్ 5న ఆదిత్య ప్రకాశ్ తన లంచ్ బాక్సులోని పాలక్ పనీర్‌ను డిపార్ట్‌మెంట్ మైక్రోవేవ్‌లో వేడి చేసుకుంటుండగా, సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారు. దాని వాసన ఘాటుగా ఉందని, ఇక్కడ వేడి చేయవద్దని సూచించారు. ఈ ఘటనపై ఆదిత్య, ఊర్మి వివక్షగా భావించి ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి యూనివర్సిటీ తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని వారు ఆరోపించారు. తమను మానసికంగా వేధించారని, ఎలాంటి కారణం లేకుండా ఊర్మిని టీచింగ్ అసిస్టెంట్ పదవి నుంచి తొలగించారని తెలిపారు. దక్షిణాసియా విద్యార్థులను లక్ష్యంగా చేసుకునేలా కిచెన్ నిబంధనలు ఉన్నాయని పేర్కొంటూ, 2025 మే నెలలో యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో దావా వేశారు. ఈ కేసు విచారణ అనంతరం 2025 సెప్టెంబర్‌లో ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, విద్యార్థులకు 2 లక్షల డాలర్ల పరిహారంతో పాటు మాస్టర్స్ డిగ్రీలు ప్రదానం చేసేందుకు వర్సిటీ అంగీకరించింది. అయితే, భవిష్యత్తులో వారు అదే యూనివర్సిటీలో చదువుకోవడానికి లేదా ఉద్యోగం చేయడానికి వీల్లేకుండా నిబంధన విధించింది. దీంతో తమ పీహెచ్‌డీలను మధ్యలోనే వదిలేసి, ఇటీవల విద్యార్థులు భారత్‌కు తిరిగి వచ్చారు. 'నా ఆహారం నా గర్వకారణం. ఏది మంచి వాసన, ఏది చెడు వాసన అనేది సార్వత్రికం కాదు, అది సంస్కృతిపై ఆధారపడి ఉంటుంది" అని ఆదిత్య ప్రకాశ్ పేర్కొన్నారు. "ఇలాంటి 'ఫుడ్ రేసిజం'ను సవాలు చేయవచ్చనే సందేశం వెళితే, అదే అసలైన విజయం' అని పేర్కొన్నారు.

## ఛార్జీల నిర్ణయం వ్యాపార రహస్యం

**వివరాలు వెల్లడించలేం: రైల్వే బోర్డు**

న్యూఢిల్లీ: ప్రయాణికుల రైలు ఛార్జీలను నిర్ణయించే పద్ధతి ఒక వ్యాపార రహస్యమని, దానిని వెల్లడించాల్సిన అవసరం లేదని కేంద్ర సమాచార కమిషన్‌కి ఇండియన్ రైల్వే స్పష్టం చేసింది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)లోని సెక్షన్ 8 ప్రకారం ఈ వివరాలు వెల్లడించాల్సిన అవసరం లేదని తెలిపింది. రైలు టిక్కెట్ ధరలను నిర్ణయించే పద్ధతి, డిమాండ్‌ను బట్టి టిక్కెట్ ధరలు పెంచడం లేదా తగ్గించడం, తత్కాల్ టిక్కెట్ల ప్రభావం గురించి సమాచారం కోరుతూ ఒక దరఖాస్తు రాగా, దీనిపై రైల్వే బోర్డు స్పందించింది. రైల్వే బోర్డు ఇచ్చిన సమాధానాన్ని కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ఆమోదిస్తూ దరఖాస్తును కొట్టివేసింది. రైళ్లలో వివిధ తరగతులు, వాటిలోని సౌకర్యాల ఆధారంగా టిక్కెట్ ధరలను నిర్ణయిస్తామని సీఐసీకి రైల్వే బోర్డు వివరించింది. రైల్వే శాఖ వ్యాపార ప్రాతిపదికన రైళ్లను నడుపుతున్నప్పటికీ, వచ్చే లాభాలను ప్రైవేటు కంపెనీల మాదిరిగా తన వద్ద ఉంచుకోదని తెలిపింది. ఆ లాభాలను సామాన్యుడికి ప్రయోజనం కలిగించేందుకు తిరిగి వెచ్చిస్తామని వెల్లడించింది. రైల్వే టిక్కెట్ ధరలను నిర్ణయించే పద్ధతిని వెల్లడించాల్సిన అవసరం లేదని సీఐసీ గతంలో కూడా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసింది.

# ఉత్తరాదిలో మహిళలు బానిసలు

**దయానిధి మారన్ వివాదాస్పద వ్యాఖ్యలు**

చెన్నై: డీఎంకే ఎంపీ దయానిధి మారన్ తాజాగా చేసిన వ్యాఖ్యలు మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఉత్తర భారతదేశంలో మహిళలను ఇంటికే పరిమితం చేసి వంటగది పనులు చేసుకుని పిల్లలను కనమని చెబుతారని, అక్కడి విద్యా విధానాలు కేవలం హిందీకే ప్రాధాన్యం ఇస్తూ ఇంగ్లీష్ చదవకుండా నిరుత్సాహపరుస్తున్నాయని ఆయన ఘాటుగా విమర్శించారు. అలాంటి విధానాల వల్లే ఉత్తర రాష్ట్రాల్లో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని, ప్రజలు దక్షిణ భారతదేశానికి వలస రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆయన అన్నారు. ఇంగ్లీష్ చదవకుండా భయపెడితే మనుషులను బానిసలుగా మార్చినట్టే అని ఆయన తీవ్రంగా స్పందించారు. తమిళనాడులో మహిళలకు విద్యకు ప్రాధాన్యం ఇవ్వడమే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన కారణమని మారన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న ద్రావిడ మోడల్ బాలికలు-బాలురు అనే తేడా లేకుండా అందరికీ సమాన విద్యా అవకాశాలు కల్పిస్తోందని, ఇక్కడి విద్యావంతులైన యువత వల్లే ప్రపంచంలోని అగ్రశ్రేణి కంపెనీలు తమిళనాడుకు వస్తున్నాయని ఆయన వివరించారు. హిందీకి మాత్రమే పరిమితమైన విద్యా విధానం కొన్ని ప్రాంతాల్లో నిరుద్యోగాన్ని పెంచుతోందని ఆరోపించారు. ఇంగ్లీష్ మీడియం చదవకపోతే



విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని, భాషపై ఆంక్షలు అభివృద్ధి మరియు ఉపాధికి అడ్డంకిగా మారుతున్నాయని మారన్ వ్యాఖ్యానించారు. ఈ విధానాలతో తమిళనాడులో అక్షరాస్యత రేటు పెరగడమే కాకుండా మహిళల ఉద్యోగ భాగస్వామ్యం కూడా గణనీయంగా పెరిగిందని ఆయన వెల్లడించారు.

**మారన్ వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్**

మారన్ వ్యాఖ్యలు ఉత్తర-దక్షిణ భారతదేశం మధ్య భాషా, విద్యా వివాదాన్ని మరింత తీవ్రతరం చేశాయి. బీజేపీ తీవ్రంగా స్పందిస్తూ మారన్‌కు బుద్ధి లేదని విమర్శించింది. హిందీ మాట్లాడేవారిని చదువులేని, సంస్కారం లేని వారిలా చిత్రీకరించడం దురదృష్టకరమని బీజేపీ నేత తిరుపతి నారాయణన్ అన్నారు. మారన్ హిందీ మాట్లాడే ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు, డీఎంకే నేత టీకేఎస్ ఇళంగోవన్.... మారన్ వ్యాఖ్యలకు మద్దతుగా నిలిచారు. ఉత్తర భారతదేశంలో మహిళల హక్కుల కోసం పోరాడేవారు తక్కువగా ఉన్నారని, ఇది రాష్ట్రాన్ని పాలించే పార్టీపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మహిళల విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నారని, తమిళనాడులో తాము మహిళల కోసం పోరాడి వారికి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించామని, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేశామని ఇళంగోవన్ చెప్పుకొచ్చారు. ప్రారంభం నుంచే మహిళా హక్కుల కోసం పనిచేస్తున్నామని ఆయన తెలిపారు.

## రైలుపై క్రేన్ కూలి 22 మంది మృతి

# థయ్‌లాండ్‌లో రైలు ప్రమాదం

న్యూఢిల్లీ: థయ్‌లాండ్‌లో బుధవారం ఘోర రైలు ప్రమాదం జరిగింది. నిర్మాణంలో ఉన్న హైస్పీడ్ రైల్వే లైన్‌కు చెందిన భారీ క్రేన్ ఒకటి ప్రయాణికులతో వెళ్తున్న రైలుపై కూలిపోవడంతో 22 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో మరో 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే, బ్యాంకాక్‌కు ఈశాన్యంగా సుమారు 230 కిలోమీటర్ల దూరంలోని నఖోన్ రచాసిమా ప్రావిన్స్‌లోని సిఖియో జిల్లాలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9 గంటల సమయంలో, బ్యాంకాక్ నుంచి ఉబాన్ రచాథని ప్రావిన్స్‌కు వెళ్తున్న స్పెషల్ ఎక్స్‌ప్రెస్ నెం.21 రైలుపై క్రేన్ కూలింది. ఈ రైలులో ప్రమాద సమయంలో 195 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. క్రేన్ బలంగా ఢీకొట్టిన ధాటికి రైలుకు చెందిన మూడు బోగీలు పట్టాలు తప్పాయి. వెంటనే మంటలు చెలరేగి దట్టమైన పొగలు కమ్ముకున్నాయని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. హైడ్రాలిక్ కట్టర్ల సహాయంతో బోగీలలో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసి, క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. "ఈ ప్రమాదంలో 22 మంది మరణించగా, 30 మందికి పైగా గాయపడ్డారు" అని నఖోన్ రచాసిమా ప్రావిన్షియల్ పోలీస్ చీఫ్ థచాపోన్ చిన్నవాంగ్ మీడియాకు ధ్రువీకరించారు. మృతుల సంఖ్యపై తొలుత భిన్నమైన నివేదికలు వెలువడినప్పటికీ, చివరకు పోలీసులు 22 మంది మరణించినట్లు స్పష్టం చేశారు. థయ్-చైనీస్ హై-స్పీడ్ రైల్వే ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భాగంగా ఈ క్రేన్‌ను ఉపయోగిస్తున్నారు. ఈ ఘటనపై థయ్‌లాండ్ రవాణా శాఖ మంత్రి ఫిఫత్ రచాకిత్‌ప్రకార్న్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని స్టేట్ రైల్వే ఆఫ్ థయ్‌లాండ్ (రా=ు)ను ఆయన ఆదేశించారు.

# భారతీయుల నిర్బంధం చట్టవిరుద్ధం

**అమెరికా ఇమిగ్రేషన్ అధికారులకు కోర్టుల మొట్టికాయలు**



న్యూయార్క్: అమెరికాలో నివసిస్తున్న పలువురు భారతీయ పౌరులను ఇమిగ్రేషన్ అధికారులు అక్రమంగా నిర్బంధించడాన్ని అక్కడి ఫెడరల్ కోర్టులు తీవ్రంగా తప్పుబట్టాయి. బెయిల్ హియరింగ్స్ నిర్వహించకుండా, చట్టపరమైన ప్రక్రియను పాటించకుండా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వారిని నిర్బంధించడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశాయి. ఈ మేరకు కాలిఫోర్నియా, మిషిగాన్, పెన్సిల్వేనియా రాష్ట్రాల్లోని ఫెడరల్ కోర్టులు ఈ నెలలో సంచలన తీర్పులు వెలువరించాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్బంధంలో ఉంచిన భారతీయ పౌరులను తక్షణమే విడుదల చేయాలని, లేదా వారికి వెంటనే బెయిల్ హియరింగ్స్ నిర్వహించాలని న్యాయస్థానాలు ఆదేశించాయి. ఇప్పటికే దేశంలో నివసిస్తున్న వారిపై, దేశంలోకి కొత్తగా ప్రవేశించే వారికి వర్తించే తప్పనిసరి నిర్బంధ నిబంధనలను ప్రయోగించడాన్ని కోర్టులు తీవ్రంగా తప్పుబట్టాయి. కాలిఫోర్నియాలోని సదరన్ డిస్ట్రిక్ట్ కోర్టు, వికాస్ కుమార్ అనే భారతీయుడి కేసులో ఐస్ అధికారుల తీరును తప్పుబట్టింది. 2024లో అమెరికాలోకి ప్రవేశించిన వికాస్, పెరోల్‌పై విడుదలై వర్క్ పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, సోషల్ సెక్యూరిటీ నంబర్ కూడా పొందారు. ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకున్న అతడిని 2025 డిసెంబర్‌లో ఫుడ్ డెలివరీ చేస్తుండగా అరెస్ట్ చేశారు. ఎలాంటి నోటీసు, వివరణ లేకుండా అతని పెరోల్‌ను రద్దు చేయడం రాజ్యాంగంలోని ఐదవ సవరణను ఉల్లంఘించడమేనని పేర్కొంటూ, అతడిని వెంటనే విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది. ఇదే తరహాలో మిషిగాన్‌లో వరుణ్ వరుణ్, సుమిత్ తులసీభాయ్ పటేల్, పెన్సిల్వేనియాలో అమిత్ కనౌత్ కేసుల్లోనూ కోర్టులు వారికి అనుకూలంగా తీర్పులనిచ్చాయి. వీరంతా ఏళ్ల తరబడి అమెరికాలో నివసిస్తూ, చట్టపరంగా ఆశ్రయం కోసం ప్రయత్నిస్తున్న వారే. ఒకసారి పెరోల్ లేదా బాండ్‌పై విడుదలైన వారికి స్వేచ్ఛకు సంబంధించిన హక్కులు ఉంటాయని, సరైన కారణాలు లేకుండా వారిని తిరిగి అరెస్ట్ చేయడం చెల్లదని న్యాయమూర్తులు స్పష్టం చేశారు.

# కెనడాలో భారత వ్యాపారవేత్త హత్య

ఒట్టావా: కెనడాలోని సర్రే నగరంలో భారత సంతతికి చెందిన వ్యక్తి హత్యకు గురయ్యాడు. మంగళవారం మధ్యాహ్నం పంజాబ్‌కు చెందిన వ్యాపారవేత్త బిందర్ గర్చా తన నివాసానికి సమీపంలో తీవ్ర గాయాలతో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయన బుల్లెట్ గాయాల కారణంగా మరణించినట్లు పోలీసులు వెల్లడించారు. బిందర్ గర్చా గత కొన్నేళ్లుగా కెనడాలో నివసిస్తున్నారని, స్టూడియో-12 పేరుతో ఫొటో స్టూడియోను నిర్వహిస్తున్నారని పోలీసులు తెలిపారు. ఈ హత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. కాల్పులు జరిపిన అనంతరం దుండగులు ఉపయోగించినట్లు భావిస్తున్న కాలిపోయిన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

# ప్రార్థనలు విఫలం కావు

**రాహుల్ పర్యటన తర్వాత డీకే పోస్ట్**

బెంగళూరు: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం గత కొన్నేళ్లుగా చర్చనీయాంశంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నిన్న కర్ణాటకలో పర్యటించిన సందర్భంగా ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ ఆసక్తికర చర్చకు దారి తీసింది. "ప్రయత్నాలు విఫలమైనప్పటికీ ప్రార్థనలు ఎన్నటికీ విఫలం కావు" అంటూ ఆయన చేసిన పోస్ట్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. రాహుల్ గాంధీ మంగళవారం మైసూరులో పర్యటించిన విషయం విదితమే. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ తదితర ముఖ్య నేతలతో ఆయన కొంతసేపు సమావేశమయ్యారు. రాష్ట్రంలో అధికార పంపిణీ వ్యవహారంపై వారి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. అధికార మార్పిడి అంశంపై స్పష్టతనివ్వాలని సిద్ధరామయ్య కోరినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శివకుమార్ చేసిన ట్వీట్ ప్రాధాన్యత సంతరించుకుంది.

# రాజ్యసభకు పోటీ చేయను

**దిగ్విజయ్ సింగ్ కీలక నిర్ణయం**

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన మూడోసారి రాజ్యసభ పదవిని కోరకూడదని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, తాను మూడోసారి రాజ్యసభకు పోటీ చేయడం లేదని వెల్లడించారు. రాజ్యసభ సీటును వదిలేది తన చేతుల్లో లేదని, కానీ సీటును ఖాళీ చేస్తున్నానని దిగ్విజయ్ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ తో ఆయన పదవీకాలం ముగియనుంది. అయితే మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ శాఖ అధ్యక్షుడు ప్రదీప్ అహిర్‌వార్ ఈసారి అభ్యర్థించడంతో దిగ్విజయ్ సింగ్ సీటును త్యాగం చేయనున్నారని సమాచారం. షెడ్యూల్ కులాలకు చెందిన నేతను ఎగువ సభకు పంపించాలని కోరుతూ ప్రదీప్ అహిర్‌వార్ పార్టీ పెద్దలకు జనవరి 13న లేఖ రాశారు. సామాజిక న్యాయం కోసం రాజ్యసభకు పార్టీ నుంచి దళితుడికి అవకాశం ఇవ్వాలని ఆయన లేఖలో కోరారు. మధ్యప్రదేశ్‌లో ఎస్సీలు 17 శాతం ఉన్నట్లు అహిర్‌వార్ తెలిపారు. కాగా, దిగ్విజయ్ సింగ్ 2014 నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 1993 నుంచి 2003 వరకు ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

# బీజేపీతో కలవం: టీవీకే

చెన్నై: నెతమిళనాడులో ఎన్నికల వేడి పెరుగుతోంది. ప్రముఖ సినీ నటుడు విజయ్ సొంత పార్టీ టీవీకేను స్థాపించి ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో అధికార డీఎంకేను ఓడించాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నారు. మరోవైపు, పొత్తులకు సంబంధించి పలు వార్తలు కూడా హల్‌చల్ చేస్తున్నాయి. బీజేపీతో విజయ్ పార్టీ పొత్తు పెట్టుకుంటుందనే ప్రచారం కూడా సాగుతోంది. ఈ అంశంపై టీవీకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్ పూర్తి క్లారిటీ ఇచ్చారు. ఈరోజు మీడియాతో ఆయన మాట్లాడుతూ... తమ పార్టీ సైద్ధాంతికంగా బలమైన పునాదిపై నిలబడిందని, ప్రత్యర్థులు ఎన్ని కుట్రలు చేసినా వెనక్కి తగ్గేది లేదని గట్టిగా చెప్పారు. బీజేపీతో మాకు ఎలాంటి సైద్ధాంతిక పొంతన లేదు, అందుకే ఆ పార్టీతో కలిసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. టీవీకే సొంత బలంతోనే, స్వతంత్రంగా ప్రజల ముందుకు వెళుతుందని ఆయన పేర్కొన్నారు. ఇక విజయ్ తాజా సినిమా 'జన నాయగన్' సెన్సార్ వివాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన మద్దతు వ్యాఖ్యలను టీవీకే హార్దికంగా స్వాగతించింది. భావప్రకటన స్వేచ్ఛను అడ్డుకుంటున్న తరుణంలో రాహుల్ మద్దతు తమకు భారీ బలాన్నిచ్చిందని పార్టీ వర్గాలు తెలిపాయి. రాహుల్ గాంధీ "జన నాయగన్‌ను బ్లాక్ చేయడం తమిళ సంస్కృతిపై దాడి" అంటూ మోదీని టార్గెట్ చేశారు. "మోదీజీ, తమిళ ప్రజల స్వరాన్ని అణచివేయలేరు" అని ట్వీట్ చేశారు.

# హరిజన్, గిరిజన్ పదాలు వాడొద్దు

హర్యానా సర్కారు కీలక నిర్ణయం

చండీగఢ్: హర్యానాలో కుల వివక్షను రూపుమాపే దిశగా నాయబ్ సింగ్ సైనీ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ రికార్డుల్లో, అధికారిక ఉత్తర్వుల్లో 'హరిజన్, గిరిజన్' పదాలు ఉపయోగించ వద్దని ఆదేశాలు జారీ చేసింది. అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ అనుబంధ సంస్థలతో పాటు విద్యాసంస్థలకు ఈమేరకు సూచనలు చేసింది. హరిజన్, గిరిజన్ పదాల స్థానంలో రాజ్యాంగంలో పేర్కొన్న షెడ్యూల్డ్ క్యాస్ట్, షెడ్యూల్డ్ ట్రైబ్ పదాలనే వాడాలని పేర్కొంది. ఈమేరకు హర్యానా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం ఒక లేఖ విడుదల చేసింది. భారత రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీలను సూచించడానికి ఈ వ్యక్తీకరణలను ఉపయోగించదని లేఖలో పునరుద్ఘాటించారు. అధికారిక వ్యవహారాలలో ఈ వ్యక్తీకరణలను నిలిపివేయాలని స్పష్టంగా ఆదేశించే భారత ప్రభుత్వ సూచనలను రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావించింది. అప్పట్లో మహాత్మా గాంధీ ఆత్మీయంగా పిలిచిన హరిజన్ అనే పదాన్ని బి.ఆర్. అంబేద్కర్ అప్పట్లోనే వ్యతిరేకించగా.. ఇప్పుడు హర్యానా ప్రభుత్వం ఆ వాదనకే పెద్దపీట వేసింది. భారత రాజ్యాంగంలో ఎక్కడా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు సంబంధించి 'హరిజన్' లేదా 'గిరిజన్' అనే పదాల ప్రస్తావన లేదని ప్రభుత్వం ఈ సందర్భంగా గుర్తు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, బోర్డులు, కార్పొరేషన్లు, యూనివర్సిటీ రిజిస్ట్రార్లు, డివిజనల్ కమిషనర్లకు గట్టి హెచ్చరికలు జారీ చేసింది.

# డెన్మార్క్‌లోనే ఉంటా

**గ్రీన్‌లాండ్ ప్రధాని స్పష్టీకరణ/... హెచ్చరించిన ట్రంప్**

లండన్/వాషింగ్టన్: తాము డెన్మార్క్‌లోనే ఉంటామని గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ చేసిన ప్రకటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. అమెరికాలో తాము చేరబోమని జెన్స్ ఫ్రెడరిక్ తేల్చి చెప్పిన నేపథ్యంలో ట్రంప్ గ్రీన్‌లాండ్‌కు మరోమారు హెచ్చరికలు జారీ చేశారు. డెన్మార్క్‌లో కొనసాగడం గ్రీన్‌లాండ్‌కు పెను సమస్యగా పరిణమిస్తుందని ట్రంప్ హెచ్చరించారు. డెన్మార్క్‌లో కొనసాగాలనేది జెన్స్ ఫ్రెడరిక్ వ్యక్తిగత సమస్య అని అభివర్ణించిన ట్రంప్, ఆయన అభిప్రాయంతో తాను ఏకీభవించబోనని అన్నారు. ఆయన గురించి తనకు పెద్దగా తెలియదని, డెన్మార్క్‌లో కొనసాగితే గ్రీన్‌లాండ్‌కే నష్టమని స్పష్టం చేశారు. గ్రీన్‌లాండ్ తప్పనిసరిగా అమెరికా భూభాగంలో చేరాలని ట్రంప్ అల్టిమేటం విధించారు. లేని పక్షంలో ఆ ప్రాంతాన్ని రష్యా, చైనా వంటి దేశాలు ఆక్రమిస్తాయని హెచ్చరించారు. ఆ దేశాలకు చెందిన రక్షణ బలగాలు ఇప్పటికే అక్కడ పాగా వేశాయని వ్యాఖ్యానించారు. తాను తలుచుకుంటే వారి కంటే అధిక సంఖ్యలో సైన్యాన్ని మోహరించగలనని పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్‌లో అమెరికా జెండా ఎగరాలని ట్రంప్ ఆకాంక్షించారు. ఇటీవల గ్రీన్‌లాండ్ ప్రజలకు ట్రంప్ నగదు ఆఫర్ చేసినట్టు వార్తలు రావడం తెలిసిందే. దీనిపై ఆయనను మీడియా ప్రశ్నించగా, అలాంటిదేమీ లేదని బదులిచ్చారు.

# రివ్యూ: నారి నారి నడుమ మురారి

సంక్రాంతి సీజన్ హిలేరియస్‌గా అయిపోయింది. చివరి బంతికి వచ్చి నవ్వుల సిక్సర్ కొట్టేసింది నారినారి నడుమ మురారి. ముందు నుంచి అనుకున్నట్లుగానే శర్వానంద్‌కు సంక్రాంతి కలిసొచ్చింది. సామజవరగమనతో మ్యాజిక్ చేసిన రామ్ అబ్బరాజు అండ్ టీం.. నారినారి నడుమ మురారితో ఆల్‌మోస్ట్ ఆ రేంజ్ రీచ్ అయిపోయారు. ఫస్టాఫ్ కానీ ఇంకాస్త నవ్వులు పడుంటేనా.. మరో సామజవరగమనా అయ్యేది. అయినా కూడా ఇందులో కామెడీకి ఢోకా లేదు. ఫస్ట్ సీన్ నుంచే హిలేరియస్ ఎపిసోడ్స్ వర్కవుట్ అయ్యాయి. సీనియర్ నరేష్‌ను రామ్ అబ్బరాజు వాడుకుంటున్న తీరు నెక్స్ట్ లెవల్. ఆయన రెండో పెళ్లితో పాటు పర్సనల్ లైఫ్‌పై సెటైర్లు కడుపులు చెక్కలయ్యేలా నవ్వించాయి. ఫస్టాఫ్‌లో నరేష్ పెళ్లి సీన్.. సత్య కామెడీ సీన్స్ బాగా వర్కవుట్ అయ్యాయి. సెకండాఫ్ అయితే బ్రేకుల్లేని బండిలా దూసుకుపోయింది సినిమా. రొటీన్ కథనే తీసుకున్నా.. ఎక్కడా బోర్ కొట్టకుండా స్క్రీన్ ప్లే రాసుకున్నాడు రామ్ అబ్బరాజు. ముఖ్యంగా డైలాగ్స్ అదిరిపోయాయి.. మాస్ జాతర డైరెక్టర్ భాను భోగవరపుదే ఆ క్రెడిట్. క్లైమాక్స్ 20 నిమిషాలు కోర్ట్ ఎపిసోడ్ మామూలుగా నవ్వలేదు. చివర్లో చిన్న సర్‌ప్రైజ్ క్యామియో కూడా ఉంది. శర్వానంద్ బాగున్నాడు.. మనోడి కామెడీ టైమింగ్ గురించి కొత్తగా ఏం చెప్పాలి..? సాక్షి వైద్య, సంయుక్త మీనన్ ఇద్దరూ బాగున్నారు. రామ్ అబ్బరాజు మరోసారి మ్యాజిక్ చేసాడు.. సింపుల్ కథతోనే బాగా ఎంటర్‌టైన్ చేసాడు.

**ఓరవాల్‌గా నారినారి నడుమ మురారి.. ఈ సంక్రాంతికి ఎంటర్‌టైనింగ్ ఎండ్ కార్డ్..!**


**సమీక్షకుడు: ప్రవీణ్ కుమార్, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టు**



## ప్యారీ చిత్రం



## ధురంధర్.. బాహుబలి 2
# రికార్డు బద్దలు




బాలీవుడ్ సినిమా ధురంధర్ విడుదలై నెల దాటుతున్న ఇంకా హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రూ.1300 కోట్ల వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం తాజాగా మరో రికార్డును అందుకుంది. గత 9 ఏండ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న ఎస్.ఎస్. రాజమౌళి 'బాహుబలి 2' రికార్డును ధురంధర్ తాజాగా అధిగమించింది. నార్త్ అమెరికాలో ఇప్పటివరకు అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా 20.7 మిలియన్ డాలర్లతో 'బాహుబలి 2' అగ్రస్థానంలో ఉండగా.. ఇప్పుడు 'ధురంధర్ణ 21 మిలియన్ డాలర్ల మార్కును దాటి అగ్రపీఠాన్ని కైవసం చేసుకుంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సినిమాల సందడి నెలకొన్నప్పటికీ, ఉత్తరాదిలో ఈ సినిమా ప్రభంజనం ఏమాత్రం తగ్గలేదు. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఇప్పటివరకు రూ. 863 కోట్ల నెట్ వసూళ్లు రాబట్టినట్లు ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. గత ఐదు రోజుల్లోనే దాదాపు రూ. 22 కోట్లకు పైగా వసూళ్లు రావడం ఈ సినిమా సత్తాను చాటుతోంది. సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, ఆర్. మాధవన్ వంటి హేమాహేమీలు నటించిన ఈ చిత్రం అటు ఆస్ట్రేలియా మార్కెట్‌లోనూ సత్తా చాటుతోంది. వచ్చే వారం 'బోర్డర్ 2' విడుదలయ్యే వరకు ఈ జోరు ఇలాగే కొనసాగే అవకాశం కనిపిస్తోంది.

# రైతునే పెళ్లి చేసుకుంటా



2024 సంక్రాంతికి త్రివిక్రమ్ దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటించిన 'గుంటూరు కారం'. ఈ సినిమాలో హీరోయిన్గా నటించి మంచి సక్సెస్ అందుకుంది. ఇక సంక్రాంతి సెంటిమెంట్ గా గత ఏడాది (2025) అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేష్ హీరోగా నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది..ఇప్పుడు మళ్లీ 2026 సంక్రాంతికి తన అదృష్టాన్ని పరీక్షించుకోవడమే కాకుండా సంక్రాంతి హీరోయిన్గా పేరు దక్కించుకోవడానికి సిద్ధమయ్యింది మీనాక్షి చౌదరి. అందులో భాగంగానే తాజాగా నవీన్ పోలిశెట్టి హీరోగా వస్తున్న 'అనగనగా ఒక రాజు' చిత్రంలో హీరోయిన్ గా నటిస్తోంది. రేపు థియేటర్లలోకి రాబోతున్న నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ లో పాల్గొన్న మీనాక్షి చౌదరి తనకు కాబోయే భర్త ఎలా ఉండాలి? ఆయనకు ఎలాంటి లక్షణాలు ఉండాలి ?అనే విషయాలను ఓపెన్ గా చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది. తనకు ఒక రైతే భర్తగా రావాలని చెప్పిన ఈమె, ఎందుకు రైతును భర్తగా కోరుకుంటోందో చెప్పి ఆశ్చర్యపరిచింది. మీనాక్షి మాట్లాడుతూ.." నాకు కాబోయే భర్త నటుడు, డాక్టరు అయి ఉండకూడదు.ముఖ్యంగా మిస్టర్ ఇండియా టైటిల్స్ గెలిచిన వ్యక్తి అసలే వద్దు. ఎందుకంటే నేను ఇప్పటికే ఆ హెూదాలలో ఉన్నాను. ముఖ్యంగా నా ఫేవరెట్ డిష్ రాజ్మా. ఈ రాజ్మాను 100 ఎకరాలలో పండించే ఒక వ్యక్తి నా భర్తగా రావాలి. ఇక మూడు పూటలా నాకు గిఫ్ట్ ఇచ్చేవాడు అయి ఉండాలి. వంట చేయాలి.. బట్టలు ఉతకాలి.. ప్రేమగా నాకు తినిపించాలి. ఇక నాకంటే చాలా హైట్ గా ఉండే వ్యక్తి నా భర్తగా రావాలి " అంటూ తన భర్తకు ఉండాల్సిన లక్షణాల గురించి చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది మీనాక్షి.

# రివ్యూ: అనగనగా ఒక రాజు


గ్యాప్ ఇవ్వరా.. గ్యాప్ ఇవ్వు.. అంతా నువ్వే చేస్తే అంటే ఎలా..? అనగనగా ఒకరాజులో నవీన్ పొలిశెట్టిని చూసాక ఇదే అనిపించింది నాకు. అస్సలు ఎవరికీ ఛాన్స్ ఇవ్వలేదు రాజుగారు. కథ లేదు.. కథనం లేదు.. ఓన్లీ బుల్లెట్ బండిలా నవీన్ డైలాగులే పేలాయి థియేటర్లో. కాకపోతే మనోడు ఎంత పర్ఫార్మ్ చేసిన పక్కన ఇంకో క్యారెక్టర్ అంతే స్థాయిలో ఉండుంటే బాగుండేది. అక్కడ స్కోప్ లేకపోయినా.. దూసుకెళ్లిపోయాడు పొలిశెట్టి. కేవలం పండగను దృష్టిలో పెట్టుకుని చేసిన పండగ సినిమా ఇది. స్టార్టింగ్ సీన్ నుంచే లీడ్ తీసుకున్నాడు నవీన్.. మైలేజ్ లేని చోట కూడా నడిపించాడు. ఫస్టాఫ్ అంతా కేవలం స్కిట్స్ మాదిరి ఎపిసోడ్స్ తరహాలో వెళ్తుంది కథ. సెకండాఫ్‌లో అసలు కథ మొదలవుతుంది.. క్లైమాక్స్ ఊహించని టర్న్ తీసుకుంటుంది. అప్పటి వరకు చూసిన కామెడీ సినిమా కాస్తా.. చివర్లో ఎమోషనల్ వైపు అడుగులేసింది. మంచి సినిమా అనిపించుకోడానికి ఇలాంటి ముగింపు ఇచ్చారేమో అనిపించింది. నవీన్ పొలిశెట్టి ఫుల్ పొటెన్షియాలిటీ వాడుకునేంత దమ్ము కథలో లేదు. అందుకే కథ, కాకరకాయతో పని లేకుండా అంతా తానే చూసుకున్నాడు ఈయన. మీనాక్షి చౌదరి అమాయకంగా స్క్రీన్ మీద చాలా బాగుంది. నవీన్ తర్వాత గుర్తుపెట్టుకునే క్యారెక్టర్ మరోటి లేదు సినిమాలో. దర్శకుడు మారి అయినా.. షో రన్నర్ మాత్రం నవీన్ పొలిశెట్టినే.

**ఓవరాల్‌గా అనగనగా ఒకరాజు.. అంతా రాజుగారే**

సమీక్షకుడు: ప్రవీణ్ కుమార్,
సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టు




# నేడు ఎల్లమ్మ గ్లింప్స్!




జబర్దస్త్ కామెడీ షో ద్వారా ఎంతో మంచి పేరు తెచ్చుకున్న వేణు ఎల్దండి ఎల్లమ్మ సినిమా గురించి ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ ను అందించారు డైరెక్టర్ వేణు. సంక్రాంతి సందర్భంగా తన రెండో సినిమాకు సంబంధించిన గ్లింప్స్ ను జనవరి 15వ తేదీ సాయంత్రం 4.05 గంటలకు రిలీజ్ చేయనున్నట్టు చెప్పారు. తన రెండో సినిమా ఎస్వీసీ బ్యానర్ లో దిల్ రాజు నిర్మాణంలోనే ఉంటుందని కూడా వేణు ఈ సందర్భంగా క్లారిటీ ఇచ్చారు. ఏదేమైనా బలగం రిలీజైన చాలా కాలానికి వేణు రెండో సినిమా గురించి అప్డేట్ వస్తుందని తెలిసి అందరూ హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకుంటున్నారు. మరి ఈ సినిమాకు దేవీ శ్రీ ప్రసాద్ కేవలం హీరోగానే వ్యవహరిస్తారా లేదా మ్యూజిక్ డైరెక్టర్ గా కూడా బాధ్యతలు తీసుకుంటారా అనేది తెలియాల్సి ఉంది.



# అదే నా ఎనర్జీ

వయసు ఒక నంబర్ మాత్రమేనని నిరూపించిన ఫిట్నెస్ ఫ్రీక్ మలైకా అరోరా. 52 వయసులోను ఎనర్జిటిక్ డ్యాన్సులు, ఫ్యాషన్ షోలతో దుమారం రేపుతోంది ఈ బ్యూటీ. వయసుతో సంబంధం లేకుండా ఎంతో ఆత్మవిశ్వాసంతో తనపై వస్తున్న ట్రోలింగ్‌కు ధీటైన సమాధానం ఇస్తుంటారు. ఇప్పుడు మరోసారి తనదైన గట్స్ ఆన్సర్ తో మలైకా చర్చల్లోకొచ్చారు. ద నమ్రతా జకారియా షోలో పాల్గొన్న మలైకా.. ఐటెం సాంగ్స్ (స్పెషల్ నంబర్స్) చేయడం తనను తాను శక్తివంతంగా మలుచుకునేలా చేస్తాయని తెలిపారు. మలైకా మాట్లాడుతూ.. 'నేను 52 ఏళ్ల వయస్సులో కూడా ఇవన్నీ చేయగలుగుతున్నానంటే, నేను ఏదో ఒక విషయంలో సరైన మార్గంలోనే ఉన్నానని అర్థం. దీని గురించి నేను క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదు.

## ఏఏ23..
# బన్నీ-లోకేశ్ కనకరాజ్ కాంబో




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం తమిళ దర్శకుడు అట్లీ డైరెక్షన్‌లో ఓ భారీ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను సన్ పిక్చర్స్ బ్యానర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇక ఈ సినిమా పూర్తిగాక ముందే, బన్నీ తన నెక్ట్స్ ప్రాజెక్ట్‌ని ప్రకటించారు. తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ డైరెక్షన్‌లో బన్నీ తన నెక్ట్స్ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు తెలిపారు. లోకేశ్ కనగరాజ్ తనదైన మార్క్‌తో ఈ సినిమా రూపొందనున్నట్లు ఓ అనౌన్స్‌మెంట్ వీడియోను రిలీజ్ చేశారు. ఈ వీడియోలో అడవికి రాజు సింహం అనేలా కొన్ని యానిమేషన్స్‌తో ఈ చిత్రాన్ని ప్రకటించారు. ఇక బన్నీ లుక్స్ ఈ సినిమాలో రెట్రో లుక్‌తో కనిపిస్తాడని తెలుస్తోంది. అనిరుధ్ రవిచందర్ ఈ అనౌన్స్‌మెంట్ వీడియోకు అదిరిపోయే సాలిడ్ మ్యూజిక్ ఇచ్చారు. ఇక ఈ ప్రెస్టీజియస్ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ సినిమాను ఏఏ23 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందించనున్నారు. ఇక ఈ సినిమాతో మరోసారి బన్నీ తనదైన మార్క్ వేయడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## బుక్ మై షో.. ఏ సినిమా ఎన్ని టికెట్లు..?

- మన శంకర వరప్రసాద్ గారు: 4,06,890 టికెట్లు
- ది రాజా సాబ్: 74,940 టికెట్లు
- ధురంధర్: 53,610 టికెట్లు
- అనగనగా ఒక రాజు: 51,530 టికెట్లు
- భర్త మహాశయులకు విజ్ఞప్తి: 50,440 టికెట్లు
- పరాశక్తి: 46,020 టికెట్లు
- అవతార్: ఫైర్ అండ్ యాష్: 15,780 టికెట్లు














# పోరాడినా.. ఓటమి

**రెండో వన్డేలో టీమిండియా ఓటమి.. కేఎల్ రాహుల్ సెంచరీ వృథ**

**కివీస్ బ్యాటర్ డారిల్ మిచెల్ అద్భుత సెంచరీ**

న్యూజిలాండ్ తో జరిగిన రెండో వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. డారిల్ మిచెల్ (117 బంతుల్లో 131 నాటౌట్) అద్భుత శతకంతో చెలరేగడంతో, టీమిండియా నిర్దేశించిన 285 పరుగుల లక్ష్యాన్ని కివీస్ సునాయాసంగా ఛేదించింది. కివీస్ 47.3 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. భారత జట్టులో కేఎల్ రాహుల్ (112 నాటౌట్) అజేయ సెంచరీ వృథ అయింది.

**రాజ్‌కోట్‌లోని నిరంజన్ షా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, కేఎల్ రాహుల్ శతకం, శుభ్‌మన్ గిల్ (56) అర్ధశతకంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (24), విరాట్ కోహ్లీ (23), శ్రేయస్ అయ్యర్ (8) వంటి కీలక బ్యాటర్లు విఫలం కావడంతో భారీ స్కోరు సాధ్యం కాలేదు.**



న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 285 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్, 46 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కాస్త తడబ డింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన డారిల్ మిచెల్, విల్ యంగ్ (87)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 162 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను భారత్ నుంచి లాగేసుకున్నారు. విల్ యంగ్ ఔటయ్యాక, గ్లెన్ ఫిలిప్స్ (32 నాటౌట్)తో కలిసి మిచెల్ లాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ మ్యాచ్ లో భారత బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు.

## కేఎల్ రాహుల్ చరిత్ర

టీమిండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ చరిత్ర సృష్టించాడు. రాజ్‌కోట్‌లోని నిరంజన్ షా స్టేడియంలో శతకం బాదిన తొలి భారత వన్డే ప్లేయర్‌గా నిలిచాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రాజ్‌కోట్ వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో సెంచరీ చేయడం ద్వారా రాహుల్ ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 284 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్ నిరాశపర్చగా.. కేఎల్ రాహుల్( 92 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 112 నాటౌట్) అజేయ శతకంతో భారత జట్టును ఆదుకున్నాడు. 118 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ జట్టును ఐదో స్థానంలో బ్యాటింగ్ వచ్చిన రాహుల్ ఆదుకున్నాడు. రవీంద్ర జడేజాతో కలిసి ఐదో వికెట్‌కు 73 పరుగులు, నితీష్ కుమార్ రెడ్డితో ఆరో వికెట్‌కు 57 రన్స్, సిరాజ్‌తో కలిసి ఏడో వికెట్‌కు 28 పరుగులు జోడించాడు. 52 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదిన రాహుల్.. మరో 30 (82) బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్నాడు. 6 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద జెమీసన్ బౌలింగ్‌లో సిక్సర్ బాది సెంచరీ పూర్తి చేసుకోవడం గమనార్హం. రాహుల్‌కు ఇది 8వ వన్డే సెంచరీ. ఈ మైదానంలో అత్యధిక వ్యక్తిగత వన్డే స్కోర్ కూడా రాహుల్‌దే. ఈ క్రమంలో అతను 11 ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. 2015లో సౌతాఫ్రికా ఓపెనర్ క్వింటన్ డికాక్ ఈ మైదానంలో 108 పరుగులు చేశాడు. ఇప్పటి వరకు ఈ మైదానంలో ఇదే హయ్యెస్ట్ వన్డే వ్యక్తిగత స్కోర్‌గా ఉ ఒడగా.. తాజా ఇన్నింగ్స్‌తో రాహుల్ అధిగమించాడు. ఈ మైదానంలో కేఎల్ రాహుల్(112 నాటౌట్), క్వింటన్ డికాక్(108), స్టీవ్ స్మిత్(98), శిఖర్ ధావన్(96), మిచెల్ మార్ష్(96) టాప్-5 స్కోరర్లుగా కొనసాగుతున్నారు.




## బ్యాడ్మింటన్‌కు ఢిల్లీ 'పొగ'!

**ఇండియా ఓపెన్ నుంచి వైదొలిగిన డెన్మార్క్ ప్లేయర్**

గత కొన్ని రోజులుగా దేశ రాజధాని ఢిల్లీని వేధిస్తున్న గాలి కాలుష్యం సమస్య.. బ్యాడ్మింటన్‌ను కూడా తాకింది. ప్రస్తుతం జరుగుతున్న 'ఇండియా ఓపెన్' (×అఒఱఖ రాజూవఅ)టోర్నీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రపంచ నంబర్ 3, డెన్మార్క్ ప్లేయర్ ఆండర్స్ ఆంటన్సెన్ ప్రకటించాడు. ఢిల్లీలో తీవ్రమైన వాయు కాలుష్యం వల్లే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు పేర్కొన్నాడు. దీంతో అతనిపై బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ 5000 డాలర్ల జరిమానా విధించింది. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో ఇండియా ఓపెన్ పోటీలు జరుగుతున్నాయి. ఇక్కడే ఆగస్టులో బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ జరగనున్నాయి. దీంతో ప్రస్తుతం జరుగుతున్న పోటీలను టెస్ట్ ఈవెంట్‌గా ప్రకటించారు.

## నం.1 కోహ్లీ

**ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో కింగ్ టాప్ ర్యాంక్**




ఇండియన్ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేస్ కొట్టేశాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో హాఫ్ సెంచరీ చేసిన కోహ్లీ తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకున్నాడు. 37 ఏళ్ల కోహ్లీ .. 2021 జూలై తర్వాత మళ్లీ వన్డే ర్యాంకింగ్స్‌లో తొలి స్థానాన్ని ఆక్రమించుకున్నాడు. మాజీ కెప్టెన్ రోహిత్ వర్మ వన్డే బ్యాటింగ్‌లో మూడవ స్థానానికి పడిపోయాడు. కోహ్లీ ఫస్ట్ వన్డేలో కివీస్‌పై 93 రన్స్ స్కోరు చేశాడు. దీంతో అతను వన్డేల్లో అత్యధిక రన్స్ చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. ఫస్ట్ లో సచిన్ టెండూల్కర్ ఉన్నాడు. కోహ్లీ తన చివరి అయిదు ఇన్నింగ్స్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌ను ప్రదర్శించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో 74, 135, 102 స్కోర్ చేశాడు. ఇక సఫారీలతో ఓ మ్యాచ్‌లో 65, కివీస్‌తో ఫస్ట్ మ్యాచ్‌లో 93 స్కోరు చేశాడు. అక్టోబర్ 2013లో కోహ్లీ తొలిసారి వన్డే ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ స్థానంలో నిలిచాడు. ఇక ఆ పొజిషన్‌లో మొత్తం 11 సార్లు అతను టాప్ ప్లేస్‌లో నిలిచాడు. కోహ్లీ తన కెరీర్‌లో 825 రోజుల పాటు వన్డే టాప్ బ్యాటర్‌గా నిలిచాడు. శుభమన్ గిల్ అయిదవ స్థానంలో, శ్రేయాస్ అయ్యర్ టాప్ 10లో ఉన్నాడు.

## గంభీర్‌తో రోకోకు విభేదాలు లేవు: సితాన్షు




టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు ఎలాంటి విభేదాలు లేవని బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ తెలిపాడు. గంభీర్‌తో కోహ్లీ, రోహిత్‌లకు మంచి సత్సంబంధాలు ఉన్నాయని స్పష్టం చేశాడు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించాడు. న్యూజిలాండ్‌తో రెండో వన్డే నేపథ్యంలో సితాన్షు కోటక్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కోహ్లీ, రోహిత్, గంభీర్ మధ్య ఉన్న రిలేషన్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టు ప్రణాళికల్లో భాగంగానే ఉన్నారు. ప్రస్తుతం వారు కేవలం వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడుతున్నారు. దాంతో ప్రతీ మ్యాచ్ గెలవాలని కోరుకుంటున్నారు. వారికి ఉన్న అపారమైన అనుభవాన్ని ఇతర ఆటగాళ్లతో పంచుకుంటున్నారు. తరుచూ సహచర ఆటగాళ్లతో మాట్లాడుతూ కనిపిస్తున్నారు. వన్డే ఫార్మాట్ గురించి, భారత్‌కు ఉన్న మ్యాచ్‌లు, సౌతాఫ్రికా పర్యటన కోసం జట్టు ప్రణాళికల గురించి గంభీర్‌తో చర్చిస్తారు. కోహ్లీ, రోహిత్‌లు తమ అనుభవాలను పంచుకోవడం నేను చూశాను. వారు ఎప్పుడూ సహచర ఆటగాళ్లతో చర్చిస్తూనే ఉంటారు.

## ఆసియా క్రీడలు..క్రికెట్ షెడ్యూల్ వచ్చేసింది!

జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరగనున్న ఆసియా క్రీడలు 2026 కోసం క్రికెట్ షెడ్యూల్ అధికారికంగా విడుదలైంది. ఈ మెగా ఈవెంట్‌లో ఆసియాలోని 10 అగ్రశ్రేణి జట్లు పసిడి పతకం కోసం హోరాహోరీగా తలపడనున్నాయి. ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి జట్ల మధ్య గట్టి పోటీ నెలకొనే అవకాశం ఉంది. గత ఎడిషన్‌లో స్వర్ణ పతకాలను గెలుచుకున్న భారత మెన్స్, ఉమెన్స్ జట్లు ఈ సారి కూడా హాట్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నాయి. ఈ క్రీడలు జపాన్‌లోని ఐచి ప్రిఫెక్చర్‌లో ఉన్న కోరోగి అథ్లెటిక్ పార్క్ వేదికగా నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్ అంతా టీ20 (ŋ20) ఫార్మాట్‌లో సాగుతుంది. భారత కాలమానం ప్రకారం మ్యాచ్‌లు ఉదయం 5:30 గంటలకు, మధ్యాహ్నం మ్యాచ్‌లు ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతాయి. మహిళల క్రికెట్ టోర్నమెంట్ సెప్టెంబర్ 17న ప్రారంభమై, సెప్టెంబర్ 22న మెడల్ మ్యాచ్‌లతో ముగుస్తుంది. ఇందులో మొత్తం 8 జట్లు పాల్గొంటాయి, ఇవి నేరుగా క్వార్టర్ ఫైనల్స్ (నాకౌట్) ఫార్మాట్‌లో తలపడతాయి. భారత మహిళల జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతుండటంతో అందరి దృష్టి వారిపైనే ఉంది. మరోవైపు పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 24 నుంచి ప్రారంభమై అక్టోబర్ 3న ముగుస్తాయి.

20th Asian Games
Aichi-Nagoya 2026

**సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 3 వరకు క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతాయి**

**లిమహిళల క్రికెట్- సెప్టెంబర్ 17, 2026(ప్రారంభం)-సెప్టెంబర్ 22, 2026(ముగింపు)**

**లిపురుషుల క్రికెట్-సెప్టెంబర్ 24, 2026(ప్రారంభం)-అక్టోబర్ 3, 2026(ముగింపు)**

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
గురువారం 15-1-2026 | www.evarthalu.com

# సైనికుడా.. సలాం








(నేడు భారత సైనిక దినోత్సవం)

**భారతదేశం నేడు ప్రపంచంలోనే ఒక బలమైన ఆర్థిక, రాజకీయ శక్తిగా ఎదుగుతోంది అంటే, దానికి ప్రధాన కారణం మన దేశ సరిహద్దులు సురక్షితంగా ఉండటమే. దేశం ప్రశాంతంగా నిద్రపోవడానికి తమ నిద్రను త్యాగం చేసే లక్షలాది మంది సైనికుల త్యాగాలకు ప్రతిరూపం ఈ సైనిక దినోత్సవం.**

భారత సైనిక దినోత్సవాన్ని ప్రతి ఏటా జనవరి 15న జరుపుకోవడానికి ఒక బలమైన చారిత్రక కారణం ఉంది. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, భారత సైన్యానికి నాయకత్వం వహించే 'కమాండర్-ఇన్-చీఫ్ణ పదవిలో బ్రిటిష్ వారే ఉండేవారు. 1949 జనవరి 15న, అప్పటి వరకు బ్రిటిష్ కమాండర్-ఇన్-చీఫ్‌గా ఉన్న జనరల్ సర్ ఫ్రాన్సిస్ బుచర్ నుండి మన దేశానికి చెందిన ఫీల్డ్ మార్షల్ కె.ఎమ్. కరియప్ప బాధ్యతలు స్వీకరించారు. ఒక భారతీయుడు భారత సైన్యానికి సర్వ సైన్యాధ్యక్షుడు కావడం అనేది భారత సైన్యం పూర్తిస్థాయిలో స్వదేశీకరణ చెందడానికి పునాది వేసింది. ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగానే మనం ఈ రోజును జరుపుకుంటున్నాం. ప్రస్తుతం భారత సైన్యం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద సైన్యంగా గుర్తింపు పొందింది. కేవలం సంఖ్యాపరంగానే కాకుండా, పోరాట పటిమలోనూ మన సైన్యం తిరుగులేనిది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధ క్షేత్రం 'సియాచిన్ణలో భారత సైన్యం మోహరించి ఉంది. మైనస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రతలో కూడా మన జవాన్లు దేశ రక్షణ కోసం నిలబడటం వారి అంకితభావానికి నిదర్శనం. రాజస్థాన్ ఎడారిలో మండే ఎండలు, ఈశాన్య రాష్ట్రాల్లోని దట్టమైన అడవులు, హిమాలయాల్లోని మంచు కొండలు - ఇలా ఏ ప్రాంతంలోనైనా పోరాడగలిగే నైపుణ్యం భారత సైన్యం సొంతం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి భారత సైన్యం అనేక సవాళ్లను ఎదుర్కొంది. ప్రతిసారీ శత్రువుల కుట్రలను తిప్పికొట్టి విజయకేతనం ఎగురవేసింది. కేవలం యుద్ధాలే కాకుండా, అంతర్గత తిరుగుబాట్లను అణచడంలో ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో భారత సైన్యం పోషిస్తున్న పాత్ర అమోఘం. సైన్యం అంటే కేవలం తుపాకీ పట్టి సరిహద్దుల్లో నిలబడటమే కాదు. దేశంలో ఏ విపత్తు సంభవించినా మొదట స్పందించేది సైన్యమే. కేరళ వరదలైనా, ఉత్తరాఖండ్ క్లౌడ్ బరస్ట్ అయినా, గుజరాత్ భూకంపమైనా.. ప్రాణాలకు తెగించి ప్రజలను కాపాడటంలో సైన్యం ముందుంటుంది. ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళాల్లో భారత సైనికులు అత్యధికంగా పాల్గొంటూ అంతర్జాతీయ స్థాయిలో దేశ గౌరవాన్ని పెంచుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా భారత సైన్యం కూడా సాంకేతికంగా బలపడుతోంది. ఒకప్పుడు ఆయుధాల కోసం ఇతర దేశాల మీద ఆధారపడే మనం, నేడు 'మేక్ ఇన్ ఇండియా' పథకం ద్వారా తేజస్ యుద్ధ విమానాలు, అర్జున్ ట్యాంకులు, అత్యాధునిక క్షిపణులను సొంతంగా తయారు చేసుకుంటున్నాము. యుద్ధ తంత్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీని జోడించడం ద్వారా భారత సైన్యం 'టెక్-సావీ' సైన్యంగా మారుతోంది. భారత సైనికుడు కేవలం ఒక వృత్తిని చేసే వ్యక్తి కాదు, అతను ఈ దేశ సమగ్రతకు చిహ్నం. క్రమశిక్షణ, నిస్వార్థ సేవ, ప్రాణ త్యాగానికి సిద్ధపడే తత్వం సైనికుడిని ఉన్నతుడిగా నిలబెడతాయి. ఈ సైనిక దినోత్సవం సందర్భంగా, ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులర్పిస్తూ, సరిహద్దుల్లో పహారా కాస్తున్న జవాన్లకు కృతజ్ఞతలు తెలుపుదాం.

**జై హింద్ - జై జవాన్**



### సవాళ్లు

**ద్విముఖ ముప్పు:** ఒకవైపు పాకిస్థాన్ నుండి ఉగ్రవాద ముప్పు, మరోవైపు చైనా నుండి సరిహద్దు వివాదాలు మన సైన్యాన్ని ఎప్పుడూ అప్రమత్తంగా ఉంచుతున్నాయి.

**పర్వత ప్రాంత రక్షణ:** సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల కల్పన (రోడ్లు, వంతెనలు) వేగవంతం చేయడం ద్వారా శత్రువులకు గట్టి సవాలు విసరాల్సి ఉంది.

**అగ్నివీర్ పథకం:** సైన్యంలో యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అగ్నిపథ్ణ వంటి పథకాల ద్వారా సైన్యం మరింత చురుగ్గా మారనుంది.

- ఈవార్తలు సంపాదకీయ విభాగం

# ట్రంప్.. గ్రీన్‌లాండ్ కథ!



21వ శతాబ్దపు అంతర్జాతీయ సంబంధాలు సాధారణంగా సార్వభౌమాధికారం, స్వేచ్ఛా వాణిజ్యం, దౌత్యపరమైన ఒప్పందాల చుట్టూ తిరుగుతుంటాయి. కానీ, అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రాకతో, పాత తరం "భూభాగ విస్తరణ" వాదం మళ్ళీ తెరపైకి వచ్చింది. ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపమైన గ్రీన్‌లాండ్‌ను డెన్మార్క్ నుండి కొనుగోలు చేయాలన్న ట్రంప్ ప్రతిపాదన కేవలం ఒక వ్యాపారవేత్త ఆలోచన మాత్రమే కాదు, అది అమెరికా భవిష్యత్తు భద్రత, ఆర్థిక ఆధిపత్యానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్. గ్రీన్‌లాండ్ వైశాల్యం దాదాపు 21 లక్షల చదరపు కిలోమీటర్లు. ఇందులో 80% పైగా మంచుతో కప్పబడి ఉంటుంది. జనాభా కేవలం 56,000 మాత్రమే. అయితే, దీని భౌగోళిక ఉనికి అమెరికాకు అత్యంత కీలకం. ఉత్తర అమెరికా ఖండానికి అతి సమీపంలో, ఆర్కిటిక్ మహాసముద్రం, అట్లాంటిక్ మహాసముద్రాల మధ్య ఇది ఒక 'వాచ్ టవర్ణ లాంటిది. ట్రంప్ పట్టుదల వెనుక మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. ఒకటి.. ఆర్కిటిక్ ఆధిపత్యం, రష్యా-చైనా ముప్పు: ప్రస్తుతం ఆర్కిటిక్ ప్రాంతం గ్లోబల్ వార్మింగ్ కారణంగా మంచు కరుగుతూ, కొత్త నౌకాయాన మార్గాలకు దారి ఇస్తోంది. రష్యా ఇప్పటికే తన ఉత్తర తీరంలో సైనిక స్థావరాలను బలోపేతం చేసుకుంది. మరోవైపు చైనా తనను తాను "నియర్ ఆర్కిటిక్ స్టేటుగా ప్రకటించుకుని, గ్రీన్‌లాండ్‌లో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ద్వారా పట్టు సాధించాలని చూస్తోంది. దీనిని అడ్డుకోవాలంటే గ్రీన్‌లాండ్ అమెరికా నియంత్రణలో ఉండాలని ట్రంప్ గట్టిగా నమ్ముతున్నారు. రెండోది అపారమైన సహజ వనరులు: గ్రీన్‌లాండ్ గర్భంలో ఆధునిక సాంకేతికతకు అవసరమైన 'రేర్ ఎర్త్ ఎలిమెంట్ణ నిధులు ఉన్నాయి. స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, యుద్ధ విమానాల తయారీకి ఇవి ప్రాణాధారం. ప్రస్తుతం వీటిపై చైనాకు ఏకఛత్రాధిపత్యం ఉంది. గ్రీన్‌లాండ్‌ను దక్కించుకోవడం ద్వారా అమెరికా ఈ వనరుల కోసం చైనాపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. మూడోది సైనిక వ్యూహం: గ్రీన్‌లాండ్‌లో ఇప్పటికే అమెరికాకు చెందిన 'పిటుఫిక్ణ (గతంలో తూలే) ఎయిర్ బేస్ ఉంది. ఇది అమెరికా క్షిపణి హెచ్చరిక వ్యవస్థలో కీలక భాగం. ఈ ద్వీపం మొత్తం అమెరికా ఆధీనంలోకి వస్తే, ఉత్తర ధ్రువం నుండి వచ్చే ఏ రకమైన ముప్పునైనా అమెరికా సమర్థవంతంగా తిప్పికొట్టగలదు. అయితే, ట్రంప్ ప్రతిపాదనను డెన్మార్క్ ప్రధాని, గ్రీన్‌లాండ్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. గ్రీన్‌లాండ్ అమ్మకానికి లేదు అని వారు స్పష్టం చేశారు. అయితే, ట్రంప్ తన వ్యాపార శైలిలో ప్రతిదానికీ ఒక ధర ఉంటుంది అనే ధోరణిలో ఉన్నారు. డెన్మార్క్ రక్షణ వ్యయం, గ్రీన్‌లాండ్‌కు డెన్మార్క్ ఇస్తున్న సబ్సిడీలను ఎత్తిచూపుతూ, అమెరికా కొనుగోలు చేయడం వల్ల డెన్మార్క్ ఆర్థిక భారం తగ్గుతుందని ఆయన వాదిస్తున్నారు. గ్రీన్‌లాండ్ ప్రజలు స్వయం ప్రతిపత్తిని కోరుకుంటున్నారు. వారు డెన్మార్క్ నుండి విడిపోయి స్వతంత్ర దేశంగా మారాలని భావిస్తున్నారే తప్ప, మరో పెద్ద దేశంలో భాగం కావాలని అనుకోవడం లేదు. అయితే, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి వారికి విదేశీ పెట్టుబడులు అవసరం. చైనా పెట్టుబడుల కంటే అమెరికా పెట్టుబడులు మెరుగని ఒక వర్గం భావిస్తున్నప్పటికీ, సార్వభౌమాధికారం విషయంలో వారు రాజీ పడటం లేదు. డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్ పట్టుదల కేవలం ఒక రాజకీయ జిమ్మిక్కు కాదు, అది రాబోయే ఆర్కిటిక్ ప్రచ్ఛన్న యుద్ధంలో అమెరికాను విజేతగా నిలబెట్టే ప్రయత్నం. డెన్మార్క్ ప్రస్తుతం తిరస్కరించినప్పటికీ, భవిష్యత్తులో ఆర్కిటిక్ ప్రాంతంలో రష్యా, చైనాల దూకుడు పెరిగితే, రక్షణ కోసం డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌లు అమెరికా వైపు మొగ్గు చూపక తప్పని పరిస్థితి రావచ్చు.

### అమెరికా కొనుగోళ్ల చరిత్ర ఇదీ..

**1803:** ఫ్రాన్స్ నుండి 'లూసియానా' కొనుగోలు.

**1867:** రష్యా నుండి 'అలాస్కా' కొనుగోలు (దీనిని అప్పట్లో పిచ్చి పని అన్న వారు కూడా ఉన్నారు, కానీ నేడు అది అమెరికాకు బంగారు గని).

**1946:** హ్యారీ ట్రూమాన్ హయాంలో కూడా గ్రీన్‌లాండ్ కోసం 100 మిలియన్ డాలర్ల ఆఫర్ ఇచ్చారు. ట్రంప్ ఈ చారిత్రక వారసత్వాన్ని కొనసాగించాలని చూస్తున్నారు.



రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.